తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం-16-డిసెంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 198 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



### రవీంద్రభారతిలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం
# విగ్రహ ఆవిష్కరణ

- ప్రముఖుల హాజరుతో ఘనంగా విగ్రహావిష్కరణ కార్యక్రమం
- సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత విభావరి ఆకర్షణ
- పరిపూర్ణ కళాకారుడిని గుర్తు చేసుకున్న వెంకయ్యనాయుడు
- ఘంటసాల తర్వాత అంతటి స్థానం బాలు దేనని దత్తాత్రేయ ప్రశంస

2లో

# మేడారం జాతర పనులు నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

- మేడారంలో అభివృద్ధి పనుల పరిశీలన చేసిన మంత్రి సీతక్క
- భక్తులకు ఇబ్బందులు లేకుండా పనులు పూర్తి చేయాలని ఆదేశం
- అమ్మవార్ల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు
- 24 గంటల పాటు పనులు చేస్తే గడువులో పూర్తి అవుతాయన్న మంత్రి
- నాణ్యతతో పాటు వేగం పెంచాలని అధికారులకు సూచన
- పరిశీలన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుల పాల్గొనటం

2లో



## పేదల పొట్ట కొట్టడమే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశం: మంత్రి సీతక్క

2లో



# యూరియా కోసం క్యూలకు చెక్

- యూరియా కోసం క్యూలు, వంతుల కష్టాలకు ముగింపు
- ఈ నెల 20 నుంచి మొబైల్ యాప్‌తో ప్రయోగాత్మక అమలు
- ఇంటి నుంచే యూరియా బుకింగ్, తేదీ ముందుగానే సమాచారం
- సమీప డీలర్ల వద్ద నిల్వల వివరాలు యాప్‌లోనే
- పక్కదారి పట్టకుండా రైతులకే ఎరువుల సరఫరా
- రైతులకు సమయం ఆదా అవుతుంది: మంత్రి తుమ్మల
- అవగాహన, ఫిర్యాదు పరిష్కారానికి హెల్ప్‌లైన్ ఏర్పాటు

**హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):** యూరియా కోసం ఎరువుల షాపులకు, సహకార సంఘాలకు వెళ్లి క్యూలో నిల్చోవడం.. చెప్పులు, పాసుపుస్తకాలు పెట్టి వంతుకోసం ఎదురుచూడడం వంటి సమస్యలకు చెక్ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతు ఇంటి నుంచే ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకొనేలా ఈ నెల 20 నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేయనుంది. తర్వాత రాష్ట్రమంతటికీ విస్తరించనుంది.

మిగతా 2లో

## 42% బీసీ రిజర్వేషన్ల బిల్లుకు పార్లమెంట్ ఆమోదం కావాలి

- ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద బీసీ సంఘాల ధర్నా
- శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే బిల్లుకు ఆమోదం కావాలి
- బీసీ రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది: మహేష్ గౌడ్
- 50 శాతం రిజర్వేషన్ పరిమితి ఎత్తివేయాలని డిమాండ్
- ధర్నాలో పాల్గొన్న రాజకీయ నేతలు, ఎంపీలు



**హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని బీసీ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు టీపీసీ చీఫ్ మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. 'బీసీ రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది. కోర్టు గడువు వల్ల పంచాయతీ ఎన్నికలకు వెళ్లాం. బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం పోరాడుతున్నాం' అని తెలిపారు.

మిగతా 2లో

# కొత్త సర్పంచ్‌లను ఇబ్బంది పెడితే సహించం

- వారికి అండగా జిల్లాల్లో ప్రత్యేక న్యాయ విభాగం ఏర్పాటు
- నూతన సర్పంచుల సన్మాన కార్యక్రమంలో కెటిఆర్



**రాజన్నసిరిసిల్ల,డిసెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన సర్పంచులను ఇబ్బంది పెట్టాలని చూస్తే సహించేది లేదని, వారి రక్షణ కోసం ప్రతి జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రత్యేక న్యాయ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి గెలుపొందిన నూతన సర్పంచుల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గెలిచిన అభ్యర్థులను అభినందిస్తూ, వారికి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ మద్దతుదారులు కాంగ్రెస్ పార్టీ బెదిరింపులకు భయపడవద్దని కేటీఆర్ భరోసా ఇచ్చారు. 'మిమ్మల్ని సస్పెండ్ చేస్తాం, ఇబ్బంది పెడతాం అని ఎవరైనా అధికారులు గానీ, పాలకపక్ష నేతలు గానీ బెదిరిస్తే ఒక్క క్షణం కూడా ఆలోచించకండి. వెంటనే పార్టీని సంప్రదించండి. మీ కోసం ప్రతి జిల్లాలో లీగల్ సెల్ ఏర్పాటు చేస్తున్నాం. అరగంటలో పార్టీ యంత్రాంగం మీకు అండగా నిలుస్తుంది, కోర్టు ద్వారా మన హక్కుల కోసం కొట్లాడుదాం' అని కేటీఆర్ స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధంగా గ్రామాలకు రావాల్సి ఫైనాన్స్ కమిషన్ నిధులను ఎవరూ ఆపలేరని, ఆ నిధులు సాధించుకునే బాధ్యత తాము తీసుకుంటామని హామీ ఇచ్చారు. కేవలం రెండేళ్ల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు, రుణమాఫీ, పెన్షన్లు, మహిళలకు తులం బంగారం వంటి హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో 40 నుండి 70 శాతం స్థానాల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు గెలవడమే ఇందుకు నిదర్శనమని అన్నారు.

మిగతా 2లో

## పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలపై బీఆర్ఎస్ పోరుబాట

- నదుల అనుసంధానం పేరుతో ఏపీ అక్రమ ప్రాజెక్టులపై ఉద్యమ నిర్ణయం
- ఈ నెల 19న తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం
- ఉద్యమ కార్యాచరణ ప్రకటించనున్న పార్టీ అధినేత కేసీఆర్
- కొడంగల్ లిఫ్ట్ పథకానికి బీఆర్ఎస్ తీవ్ర వ్యతిరేకత
- మహబూబ్‌నగర్ జిల్లాలో భారీ బహిరంగ సభల యోచన
- కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులపై ప్రభుత్వంపై ఒత్తిడి

సుదీర్ఘ విరామం తర్వాత బహిరంగ వేదికపైకి రానున్న కేసీఆర్




**హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై కేంద్ర,, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పోరుబాటకు సిద్ధమవుతోంది. మరోవైపు నదుల అనుసంధానం పేరిట ఏపీ ప్రభుత్వం చేపడుతున్న అక్రమ ప్రాజెక్టులపైనా ఉద్యమించాలని నిర్ణయించింది. అందులో భాగంగా పాలమూరు జిల్లాలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని భావిస్తోంది.
బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల నిర్వహణలో ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టేందుకు సన్నద్ధమవుతోంది. పాలమూరు ఎత్తిపోతలపై అనుసరించాల్సిన ఉద్యమ కార్యాచరణపై ఈ నెల 19న తెలంగాణ భవన్‌లో పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు కీలక ప్రకటన చేయనున్నారు.


మిగతా 8లో

# 2029 ఎన్నికల్లో పోటీ చేస్తాం

- సామాజిక తెలంగాణే మా ధ్యేయం: కవిత
- 2029 ఎన్నికల్లో పోటీ చేస్తాం, పార్టీ పేరుపై ప్రజల సూచనలు: ఎమ్మెల్సీ కవిత
- 'ఆస్క్ కవిత' ద్వారా నెటిజన్ల ప్రశ్నలకు సమాధానాలు
- యువత, మహిళలకు రాజకీయ అవకాశాలు పెరగాలి
- ఉచిత నాణ్యమైన విద్య, వైద్యంపై స్పష్టమైన విజన్
- కాంగ్రెస్ పాలనపై తీవ్ర విమర్శలు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యార్థుల ఇబ్బందులు
- ఫార్మా సిటీ భూసేకరణపై రైతులతో కలిసి పోరాటం

8లో





## జీహెచ్ఎంసీ డివిజన్ల పెంపుపై హైకోర్టులో పిటిషన్

- ప్రజాభ్యంతరాలు పట్టించుకోలేదంటూ వినయ్‌కుమార్ సవాల్
- డివిజన్ల పునర్విభజనపై కోర్టు జోక్యం కోరిన పిటిషనర్
- అత్యవసర విచారణ చేపట్టిన హైకోర్టు

2లో

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# మేడారం జాతర పనులు నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

రానున్న మహా మేడారం జాతరను పురస్కరించుకుని ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, నిర్ణీత సమయంలో భక్తులకు అందుబాటులో ఉంచాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. సోమవారం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో కలిసి మేడారంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. మేడారం చేరుకున్న మంత్రి, ఎమ్మెల్యేకు గిరిజన పూజారులు తమ సాంప్రదాయం ప్రకారం అమ్మవార్ల గద్దెల పై ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అనంతరం మంత్రి మాట్లాడుతూ ముందస్తు మొక్కలో భాగంగా సెలవు రోజులలో వేలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకుంటున్నారని, దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల రాతి నిర్మాణ పనులను 24 గంటల పాటు పనులు చేయిస్తే గడువులోగా పనులు పూర్తి అవుతాయని అభిప్రాయపడ్డారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, పూజారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పేదల పొట్ట కొట్టడమే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశం: మంత్రి సీతక్క

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

పేదల పొట్ట కొట్టడమే కేంద్ర ప్రభుత్వం ఉద్దేశమని మంత్రి సీతక్క విమర్శించారు. అందుకే మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరునే కాకుండా, దాని ఆత్మను, అమలు విధానాన్ని మార్చేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని అసంతృప్తిని వ్యక్తం చేశారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును 'వికసిత్ భారత్‌గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్)గా మార్చే బిల్లును కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఆ బిల్లును మంత్రి సీతక్క తీవ్రంగా తప్పుబట్టారు. గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా కల్పించాలనే మహాత్మాగాంధీ ఆలోచనలకు విరుద్ధంగా కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలు ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర విధానం పేదలను, రాష్ట్రాలను శిక్షించే విధంగా ఉందని పేర్కొన్నారు. గ్రామీణ పేదలకు జీవనోపాధి భద్రత కల్పించడం, వలసలను తగ్గించడం, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధిని సాధించడం వంటి గొప్ప లక్ష్యాలతో నాటి యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ చారిత్రక పథకాన్ని నిర్వీర్యం చేయాలనే దురుద్దేశంతోనే కేంద్రం ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటున్నట్లు ఆరోపించారు.

గతంలో వంద శాతం నిధులు వెచ్చిస్తూ పథకాన్ని అమలు చేసిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు తన వాటాను 60 శాతానికి తగ్గించి, మిగిలిన 40 శాతం భారాన్ని రాష్ట్రాలపై మోపడం అన్యాయమని పేర్కొన్నారు. ఇది రాష్ట్రాల ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపే నిర్ణయమని, కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నమేనని విమర్శించారు. పథకం పేరులో నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం ద్వారా గాంధీజీ ఆలోచనలు, విలువలపై కేంద్ర ప్రభుత్వానికి ఉన్న వ్యతిరేక వైఖరి స్పష్టంగా కనిపిస్తున్నదని ఆరోపించారు. మొదటి నుంచే ఈ పథకం నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఇష్టం లేదని, అందుకే దశలవారీగా బలహీనపరిచే కుట్రలకు తెరలేపుతున్నదని పేర్కొన్నారు. చట్టం ప్రకారం ప్రతి గ్రామీణ పేద కుటుంబానికి వంద రోజుల ఉపాధి కల్పించాల్సి ఉన్నప్పటికీ, బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఏ ఏడాదిలోనూ 42 రోజుల కన్నా ఎక్కువ పని దినాలు కల్పించలేదని ఆరోపించారు. ఇది చట్ట ఉల్లంఘనకు సమానమని తెలిపారు. గత ఏడాది రాష్ట్రంలో 12.5 కోట్ల పని దినాలు కల్పించగా, ఈ ఏడాది కేవలం 7.5 కోట్ల పని దినాలకే పరిమితం చేశారని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పూర్తి నిధులతో, బాధ్యతాయుతంగా కేంద్ర ప్రభుత్వమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# యూరియా కోసం క్యూలకు చెక్

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి సంవత్సరం రెండు వ్యవసాయ సీజన్లకు కలిపి 20 లక్షల టన్నుల మేరకు యూరియా వినియోగమవుతోంది. దీని పంపిణీ ఏటేటా సమస్యాత్మకమవుతోంది. ఏడాది ఆరంభంలో యూరియా కొరత వల్ల రైతులు ఇబ్బందులు పడ్డారు. ధర్నాలు చేశారు. ఈ అంశంపై అధ్యయనం చేసిన వ్యవసాయశాఖ ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించింది. ఇందులో యూరియా సమాచారం నిక్షిప్తం చేస్తారు. రైతు తన పంటలకు అవసరమైన పరిమాణాన్ని, తనకు అనుకూలమైన ఏ డీలరు వద్ద



నుంచైనా ముందుగా బుక్ చేసుకుంటే ఒక ఐడీ వస్తుంది. దీని ఆధారంగా ఏ రోజు యూరియా సరఫరా చేస్తారో తెలుస్తుంది. ఆ రోజు డీలరు వద్దకు రైతు వెళ్లి కొనుగోలు చేయవచ్చు. యాప్ ద్వారా రైతులు తమ సమీపంలోని డీలరు, జిల్లా పరిధిలోని ఇతర డీలర్ల వద్ద ఉన్న నిల్వలను కూడా తెలుసుకోవచ్చు.

**రైతులకు సమయం ఆదా:** మంత్రి తుమ్మల రైతులకు సమయం ఆదాతో పాటు యూరియా, ఇతర ఎరువుల పంపిణీని సరళతరం చేయడానికి ఈ విధానం తీసుకొచ్చాం. దీని ద్వారా ఎరువుల పక్కదారి పట్టకుండా, పంట పండించే రైతులకు మాత్రమే అందుతాయి. యాప్ వినియోగంపై అన్నదాతలకు సమస్యలుంటే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించవచ్చు. అధికారులందరూ యాప్ గురించి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. రైతుల సౌకర్యార్థం, ఏవైనా సమస్యలు ఎదురైతే పరిష్కరించేందుకు హెల్ప్‌లైన్ నంబర్లతో కూడిన ఫిర్యాదు పరిష్కార వ్యవస్థను కూడా ఏర్పాటు చేస్తాం.

# కొత్త సర్పంచ్‌లను ఇబ్బంది పెడితే సహించం

(మొదటి పేజీ తరువాయి)

సూర్యాపేట జిల్లాలో మల్లయ్య యాదవ్ హత్య, తిప్పర్తిలో కిడ్నాప్ వంటి ఘటనలను ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పంచాయతీ ఎన్నికల్లో ప్రచారం చేసిన ప్రజల వ్యతిరేకత నుంచి కాంగ్రెస్‌ని కాపాడలేకపోయారని కేటీఆర్ అన్నారు. మంత్రులు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ నాయకుల అరాచకాలకు బెదరకుండా భయపడకుండా ప్రజలు మా పార్టీ నేతలు నిలబడ్డారని.. అందుకే అత్యధిక స్థానాల్లో ప్రతిపక్షంలో ఉన్న మా పార్టీని గెలిపించారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పట్ల నెలకొన్న తీవ్రమైన అసంతృప్తికి వ్యతిరేకతకు పంచాయతీరాజ్ ఎన్నికల ఫలితాలు నిదర్శనం అన్నారు.



సర్పంచులు కేవలం పదవులను అలంకారప్రాయంగా కాకుండా, గ్రామ అభివృద్ధికి సాధనంగా వాడుకోవాలని కేటీఆర్ సూచించారు. సూర్యాపేట జిల్లాలోని 'ఏపూర్' గ్రామాన్ని ఉదాహరణగా తీసుకుంటూ.. అక్కడ చెక్ డ్యాంలు, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం వంటి నిర్మాణాలతో ఆ గ్రామం దేశంలోనే ఉత్తమ పంచాయతీగా అవార్డు పొందిందని గుర్తుచేశారు. ఐదేళ్ల తర్వాత ప్రజలు మనల్ని గుర్తుపెట్టుకోవాలంటే, మనం చేసిన పనే మనకు శ్రీరామరక్ష అని హితవు పలికారు. పల్లె ప్రగతి ద్వారా ప్రతి ఊరిలో నర్సరీ, డంప్ యార్డ్, ట్రాక్టర్, వైకుంఠధామం వంటివి ఏర్పాటు చేసి గ్రామాల రూపురేఖలు మార్చామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తయిన వెంటనే, గెలిచిన సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు పంచాయతీరాజ్ చట్టం, విధులు, హక్కులపై అవగాహన కల్పించేందుకు నిపుణులతో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తామని కేటీఆర్ వెల్లడిరచారు. మిగిలిన విడత ఎన్నికల్లోనూ పార్టీ శ్రేణులు కష్టపడి గులాబీ జెండా ఎగురవేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. దేశ జనాభాలో కేవలం 3 శాతం ఉన్న తెలంగాణ, కేంద్రం ప్రకటించిన ఉత్తమ పంచాయతీ అవార్డుల్లో 30 శాతం కైవసం చేసుకుందని, ఇది కేసీఆర్ పాలన దక్షతకు నిదర్శనమని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ రికార్డును దేశంలో ఏ రాష్ట్రం కూడా సాధించలేదని అన్నారు. ప్రతి గ్రామంలో కనీస మౌలిక వసతులను ఏర్పాటు చేశామని ప్రతి గ్రామానికి పరిశుద్ధ నిర్వహణ నుంచి మొదలుకొని పచ్చదనం వరకు తాగునీటి సరఫరా వరకు అన్ని రంగాల్లో అద్భుతమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అందుకే తెలంగాణ పంచాయతీ రాజ్ వ్యవస్థకు కేంద్రం నుంచి అనేక అంశాల్లో ఉత్తమ గ్రామ పంచాయతీలు ఉత్తమ జిల్లా పరిషత్తులు అవార్డులను దక్కించుకున్నాయని అన్నారు.

# చెదిరిన సర్పంచ్ కల

◆ విఆర్ఎస్ తీసుకున్న ఎస్ఐకి ఓటమి

**కోదాడ,డిసెంబర్15(తెలంగాణ ముచ్చట్లు):** ఐదు నెలల సర్వీస్ మిగిలి ఉండగానే స్వచ్ఛంద పదవీ విరమణ చేసి సర్పంచ్‌గా పోటీ చేసిన ఎస్ఐ ఓడిపోయారు. తన సర్పంచ్ కలను నెరవేర్చుకోలేక పోయారు. ఈ ఘటన కోదాడ మండలంలో వెలుగుచూసింది. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిగా పోటీ చేసిన వెంకటేశ్వర్లు ఓటమి పాలయ్యారు. రెండవ విడత ఎన్నికల్లో ఆయన సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన గుడిబండ గ్రామంలో ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి.. రేషన్ డీలర్ అయిన నాగయ్య చేతిలో 10 ఓట్ల తేడాతో వెంకటేశ్వర్లు ఓడిపోవడం గమనార్హం. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సూర్యాపేట జిల్లా కోదాడ ఎస్సై పోస్ట్ నుంచి వెంకటేశ్వర్లు వీఆర్ఎస్ తీసుకున్నారు. కోదాడ మండలం గుడిబండ గ్రామానికి చెందిన పులి వెంకటేశ్వర్లు కోదాడ టౌన్‌లో ఎస్సైగా పని చేసేవారు. కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో చేరిన ఆయన కష్టపడి పైకొచ్చారు. ఎస్సైగా పదోన్నతి పొందారు. ఐదు నెలల సర్వీస్ మిగిలి ఉండగానే ఆయన స్వచ్ఛంద పదవీ విరమణ నిర్ణయం తీసుకుని ఎన్నికల బరిలోకి దిగారు. తాను పుట్టి పెరిగిన గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పిన ఆయనకు గ్రామస్తులు అండగా నిలవకపోవడం గమనార్హం.



# రవీంద్రభారతిలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహ ఆవిష్కరణ

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

రవీంద్రభారతి ప్రాంగణంలో ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి శ్రీధర్‌బాబు, భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు ఇతర ప్రముఖులు హాజరయ్యారు. 7.2 అడుగుల బాలు కాంస్య విగ్రహాన్ని తూర్పు గోదావరి జిల్లాలో ప్రత్యేకంగా తయారు చేయించారు. విగ్రహావిష్కరణలో భాగంగా రవీంద్ర భారతిలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బాలసుబ్రహ్మణ్యంకు ఇష్టమైన 20 పాటలతో ఇవాళ సాయంత్రం 50 మందితో సంగీత విభావరి కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్నేహశీలి, మృదుస్వభావి అని, ఇవాళ పరిపూర్ణ కళాకారుడిని గుర్తు చేసుకుంటున్నామని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వివిధ రంగాల్లో ప్రతిభ చూపించారని చెప్పారు. ‘‘ తెలుగు పాటకు ఘంటసాల, ఎస్పీ బాలు పట్టం కట్టారు. సినీ చరిత్రలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పేరు చిరస్థాయిగా ఉంటుంది. ఎస్పీ గళం.. సంగీత దర్శకుడు ఏది కోరుకుంటుందో అది ఇచ్చే అక్షయపాత్ర. గళంలో వైవిధ్యం చూపడం ఎస్పీ బాలు ప్రత్యేకత. ఆయన తెలుగు ఉచ్ఛారణ వింటుంటే ఎంతో ఆనందంగా ఉండేది. ఆయన హాస్యం, సమయస్ఫూర్తి అందర్నీ అలరించేది. ‘పాడుతా తీయగా’ కార్యక్రమం ద్వారా వందలమంది గాయకులను పరిచయం చేశారు’’ అని వెంకయ్యనాయుడు గుర్తు చేసుకున్నారు. ‘‘బాల సుబ్రహ్మణ్యం విగ్రహ ఏర్పాటు మన తెలుగు ప్రజలందరికీ గౌరవం అని భావిస్తున్నా. ఎస్పీబీ గాయకుడే కాదు సంగీత దర్శకుడు, నటుడు. పలు భాషల్లో 40 వేలకుపైగా పాటలు పాడారు. ఘంటసాల తర్వాత అంతటి పేరు తెచ్చుకున్నారు. ‘శంకరాభరణం’లో ఆయన పాటిన ‘శంకరా’ పాట నా మనసుకు హత్తుకుంది. ‘పుణ్యభూమి నా దేశం’ దేశభక్తిని చాటింది. ‘అదిగో అల్లదిగో శ్రీహరివాసము’ గీతం వింటే సాక్షాత్తూ వేంకటేశ్వరుడిని చూసినట్లే ఉంటుంది. టీవీ కార్యక్రమం ‘పాడుతా తీయగా’ ద్వారా ఎంతోమంది గాయనీ గాయకులను పరిచయం చేశారు’’ అని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రశంసించారు.



# 42% బీసీ రిజర్వేషన్ల బిల్లుకు పార్లమెంట్ ఆమోదం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు సోమవారం(డిసెంబర్ 15వ తేదీ) ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీ సంఘాల జేఏసీ ధర్నా నిర్వహించింది. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బీసీ రిజర్వేషన్లు 42%కు పెంపు చట్టానికి ఆమోదం కోరుతూ ఆందోళన చేపట్టింది జేఏసీ. శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేసింది.

సామాజిక రిజర్వేషన్లపై దేశవ్యాప్తంగా ఉన్న 50 శాతం పరిమితి ఎత్తివేయాలని డిమాండ్ చేసింది. ఈ ధర్నాలో మహేష్‌గౌడ్‌తో పాటు వి. హనుమంతరావు, విల్సన్ ఎంపీ (డిఎంకే), కే. నారాయణ (సిపిఐ), వి. శ్రీనివాస్ గౌడ్, వద్దిరాజు రవిచంద్ర ఎంపీ, మల్లు రవి ఎంపీ, అనిల్ కుమార్ యాదవ్‌లు హాజరయ్యారు.

# జీహెచ్‌ఎంసీ డివిజన్ల పెంపుపై హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

హైదరాబాద్‌లో జీహెచ్‌ఎంసీ డివిజన్ల సంఖ్య పెంపులో కీలక పరిణామం చోటు చేసుకుంది. జీహెచ్‌ఎంసీ డివిజన్ల సంఖ్య పెంపును సవాల్ చేస్తూ వినయ్‌కుమార్ అనే వ్యక్తి సోమవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. డివిజన్ల పునర్విభజన సమయంలో ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను ప్రభుత్వం పట్టించుకోలేదని పిటిషన్ లో పేర్కొన్నారు. తాను సమర్పించిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకునేలా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోర్టును అభ్యర్థించారు. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని ఆయన కోర్టును కోరగా.. జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి పిటిషన్ పై విచారణ చేపట్టారు.





## బండారపాకుల సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను సన్మానించిన చిన్నారెడ్డి

**వనపర్తి,డిసెంబర్15(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా రేవల్లి మండలం బండార పాకుల గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌గా దుపం రాజు, ఉపసర్పంచ్‌గా సూక్మారెడ్డి, అలాగే ఏడుగురు వార్డు సభ్యులు ఘన విజయం సాధించిన నేపథ్యంలో, సోమవారం ఉదయం వారు తమ బృందంతోకలిసి రాష్ట్రప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి సర్పంచ్ దుపం రాజు, ఉపసర్పంచ్ సూక్మారెడ్డి, ఏడుగురు వార్డు సభ్యులను శాలువాలతోసన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.గ్రామ ప్రజలు తమపై ఉంచిన విశ్వాసానికి రుణపడి ఉండాలని, గ్రామంలో ఎలాంటి సమస్య వచ్చినా ప్రజలకు అందుబాటులో ఉండి వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామ ప్రజలకు పూర్తిస్థాయిలో చేరవేసి, బండారపాకుల గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు.బండారపాకుల గ్రామ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని డాక్టర్ చిన్నారెడ్డి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బాబా, సీనియర్ నాయకులు మన్యం యాదవ్‌తో పాటు ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.




సాయంత్రం వాలిబాల్ ఆడుతున్న గ్రామ యువత

### ప్రకృతి వనాల పేరుతో

# క్రీడా మైదానాల ఆక్రమణ

**ఎల్కతుర్తి మండలంలో క్రీడలకు గండం**

**ఎల్కతుర్తి, డిసెంబర్ 15(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలానికి ఒకప్పుడు క్రీడల్లో ప్రత్యేక గుర్తింపు ఉండేది. జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడాకారులను తయారు చేసిన ఈ మండలం నేడు ఆట స్థలాల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంతో పాటు వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల ఆట స్థలాలను గత ప్రభుత్వం చేపట్టిన ప్రకృతి వనాల పేరుతో పిచ్చి మొక్కలు, అడవి మొక్కలతో నింపేశారని విద్యార్థులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఒకప్పుడు ఆటలతో కళకళలాడిన మైదానాలు పూర్తిగా నిరుపయోగంగా మారాయని వారు ఆరోపిస్తున్నారు.

ఆట స్థలాలు లేకపోవడంతో విద్యార్థులు క్రీడా సాధనకు అవకాశం లేక ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యం తగ్గిపోతుండటంతో భవిష్యత్‌లో క్రీడలు పూర్తిగా మరుగున పడే ప్రమాదం ఉందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి క్రీడలు ఎంతో అవసరమని, అయితే ఆట స్థలాల స్థానంలో ప్రకృతి వనాలు ఏర్పాటు చేయడం సరైన విధానం కాదని క్రీడాభిమానులు విమర్శిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి, ప్రకృతి వనాలు - క్రీడా మైదానాల మధ్య సమతుల్యత పాటిస్తూ, పాఠశాలలు, క్రీడా ప్రాంగణాల్లో ఆట స్థలాలను పునరుద్ధరించాలని విద్యార్థులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



**క్రీడా మైదానాలు లేక విద్యార్థులు యువత సెల్‌ఫోన్లకే పరిమితం**

**స్థానిక క్రీడాకారుడు– కర్రె. నితీష్ మాట్లాడుతూ, "గ్రామీణ పాఠశాలల్లో క్రీడా మైదానాలు ఉంటే విద్యార్థులు ఆరోగ్యంగా, క్రమశిక్షణతో ఎదుగుతారు. కానీ ప్రస్తుతం క్రీడా మైదానాల స్థానంలో ప్రకృతి వనాల పేరుతో మొక్కలు నాటడంతో విద్యార్థులు, యువత ఆటలకు దూరమయ్యారు. ఫలితంగా నేటి యువత ఎక్కువ సమయం సెల్‌ఫోన్లకే పరిమితమవుతోంది. ఒకప్పుడు మండల స్థాయి నుంచి జాతీయ స్థాయివరకు మన ఎల్కతుర్తి మండలం విద్యార్థులు రాణించేవారు. నేడు ఆట స్థలాల లేమితో క్రీడలు కనుమరుగవుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి క్రీడా మైదానాలను పునర్నిర్మించి విద్యార్థులకు, యువతకు క్రీడలు ఆడుకునే వసతులు కల్పించాలి" అని కోరారు.**



## కన్మనూరు కాంగ్రెస్ నేతలు బిఆర్ఎస్ పార్టీలో చేరిక

**అడ్డాకల్,డిసెంబర్15(తెలంగాణ ముచ్చట్లు):** అడ్డాకల్ మండలంకన్మనూరు గ్రామంలో సర్పంచ్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నేతలు బిఆర్ఎస్ పార్టీలో చేరారు.మాజీ వార్డ్ మెంబర్స్ రామ్ చరణ్ యాదవ్, మన్నెకొండ యాదవ్, ఆంజనేయులు, జానకి రాంరెడ్డి, ఎం.డి. ఖాదర్‌లు ఈరోజు అధికార పార్టీకి చేరినట్లు తెలిపారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. సర్పంచ్ ఎన్నికల్లో గ్రామ అభివృద్ధికి కృషి చేయడం అత్యంత ముఖ్యమైన పని. పార్టీ కార్యకర్తలు చురుకుగా పాల్గొని అభ్యర్థి లక్ష్మి వెంకటస్వామిని గెలిపించడానికి సహకరించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుమతమ్మ భీమ్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రాజ వర్ధన్ రెడ్డి, రాజారెడ్డి, బాలస్వామి యాదవ్, సత్యనారాయణ రెడ్డి తదితర పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆశాలపై పని భారం తగ్గించాలి : సీఐటీయూ డిమాండ్

**మేడ్చల్–మల్కాజిగిరి, డిసెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు)**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ - సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు భారీ ధర్నా నిర్వహించారు.



ఆశాలపై పెరుగుతున్న పని భారం తగ్గించాలి, వేధింపులు ఆపాలని, పెట్టి చాకిరి చేయించకూడదని డిమాండ్ చేశారు. బాలానగర్ పీహెచ్‌సీలో పనిచేసిన ఏడుగురు ఆశాలకు వెంటనే జీతాలు చెల్లించాలని, దుర్భాషలాడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ ధర్నాకు యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు కామ్రేడ్ కె. ఉన్నికృష్ణన్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ పనుల పేరుతో ఆశా వర్కర్లను దుర్భాషలాడుతూ మానసికంగా వేధిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఈ సమస్యను డీఎం అండ్ హెచ్‌వో దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఐదు రోజుల పాటు కలెక్టర్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టాలని, 22వ తేదీ సోమవారం భారీ ధర్నా నిర్వహించాలని యూనియన్ నిర్ణయించింది.సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం. కిష్టప్ప మాట్లాడుతూ మహిళా కార్మికులను అధికారులు వేధిస్తే సీఐటీయూ చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. 30 రోజులు పనిచేయించి జీతం ఇవ్వకపోవడం వెట్టిచాకిరి కాదా అని ప్రశ్నించారు. ఆన్‌లైన్ పనులకు ఫోన్, నెట్ రీచార్జ్, శిక్షణ ఇవ్వకుండా పని చేయమంటే ఎలా సాధ్యమవుతుందని నిలదీశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం. రేవతి, కోశాధికారి రాధా, నాయకులు లత, జయప్రద, కవితతో పాటు కీసర, చర్లపల్లి, మల్లాపూర్ ప్రాంతాల ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య కార్మికురాలి భర్త మృతి

- **మృతుని కుటుంబానికి ముదిరాజ్ యువత ఆర్థిక అండ**

**పెద్దమందడి,డిసెంబర్15(తెలంగాణ ముచ్చట్లు):** మదిగట్ల గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికురాలు గొల్ల లక్ష్మమ్మ భర్త గొల్ల లక్ష్మయ్య శనివారం సాయంత్రం హఠాత్తుగా గుండెపోటుతో మృతి చెందారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.ఈ విషయం తెలుసుకున్న ముదిరాజ్ సంగం యువకులు మానవతా దృక్పథంతో స్పందించి, తమ వంతు సహాయంగా అందరూ కలిసి రూ.20,500 నగదును సేకరించారు. సేకరించిన ఆర్థిక సహాయాన్ని గొల్ల లక్ష్మమ్మకి అందజేశారు.ఈ సందర్భంగా ముదిరాజ్ యువత మాట్లాడుతూ.. మృతుని కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే దేవుడు కుటుంబానికి మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ యువత సభ్యులు పాల్గొన్నారు.




## దివ్యాంగుల జిల్లా స్థాయి సమన్వయ సమావేశం

**మేడ్చల్ మల్కాజిగిరి, డిసెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు, మహిళా, శిశు, దివ్యాంగులు & వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో దివ్యాంగుల జిల్లా స్థాయి సమన్వయ సమావేశం సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నిర్వహించబడింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వివిధ జిల్లా శాఖల ముఖ్య అధికారులు హాజరై, దివ్యాంగులు జిల్లా స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటిపై అవగాహన కల్పించారు. సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.అనంతరం జిల్లా సంక్షేమ అధికారిణి (మహిళా, శిశు, దివ్యాంగులు & వయోవృద్ధుల సంక్షేమ శాఖ),మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మాట్లాడుతూ, దివ్యాంగుల సంక్షేమానికి శాఖ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. వారి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద, జిల్లా డిఆర్డిఓ అధికారి సాంబశివరావు, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి వినోద్ కుమార్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్, డిఈఓ, డిఎం&హెచ్ఓ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే అసోసియేషన్ ప్రతినిధులు కిరణ్, వెంకట్, వినయ్, శ్రీనివాస్ రెడ్డి, శివకృష్ణ, టైగర్ నరసింహ, శంకర్ నాయక్, నాగరాజు, శ్రీశైలం, నాగలక్ష్మి తదితరులు హాజరయ్యారు.ఇక ఎన్జిఓ ప్రతినిధులుగా ఉమర్ ఖాన్, మధుసూదన్ రెడ్డి, పాపారావు, శ్యామ్ సుందర్ పాల్గొనగా, డిడబ్ల్యుఓ కార్యాలయ సిబ్బంది మరియు ఇతరులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.



## కొమ్ము ప్రభును అభినందించిన లింగాల కమల్ రాజ్

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** చింతకాని మండలం తిమ్మినేని పాలెం గ్రామపంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా గెలుపొందిన కొమ్ము ప్రభు ను మధిర నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజ్ అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ముఖ్య నాయకులు మరియు గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొనడం జరిగింది

## నాచారం షాహి పరిశ్రమ మహిళా కార్మికుల సమ్మె 8వ రోజుకు

**నాచారం, డిసెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** నాచారం షాహి పరిశ్రమలో పనిచేస్తున్న మహిళా కార్మికులు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె సోమవారం ఎనిమిదవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో పరిశ్రమ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి సిఐటియు జిల్లా కోశాధికారి పి. గణేష్ అధ్యక్షత వహించారు.ధర్నాను ఉద్దేశించి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ... మహిళా కార్మికుల పోరాటాలు చరిత్రలో ఎన్నో విజయాలు సాధించాయని అన్నారు. కార్మికుల శ్రమను దోచుకుంటూ యాజమాన్యం లాభాలు గడిస్తున్నా వేతనాలు పెంచకపోవడం దురదృష్టకరమన్నారు. గత ఎనిమిది రోజులుగా మహిళా కార్మికులు స్వతంత్రంగా సమ్మె చేస్తున్నప్పటికీ యాజమాన్యం నుంచి సరైన స్పందన రాకపోవడంతో సిఐటియు అండగా నిలుస్తోందని తెలిపారు.ఈ పోరాటం విజయవంతం అయ్యే వరకు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో అన్ని కార్మిక సంఘాల మద్దతు కూడగట్టేందుకు సిఐటియు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ నెల 17, 18 తేదీల్లో ఢిల్లీలో జరిగే సిఐటియు జాతీయ కమిటీ సమావేశంలో షాహి పరిశ్రమలో జరుగుతున్న సమ్మె అంశాన్ని ప్రస్తావిస్తామని తెలిపారు. దేశవ్యాప్తంగా షాహి పరిశ్రమలతో పాటు ఇతర కంపెనీల ముందు ధర్నాలు చేపట్టేలా కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు.జెసిఎల్ వద్ద చర్చలు జరపాలని కార్మికులకు సూచించగా యాజమాన్యం రేపు చర్చలకు రావడానికి అంగీకరించిందని తెలిపారు. చర్చలు కార్మికులకు అనుకూలంగా ఫలిస్తే సమ్మె విరమిస్తామని, లేదంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని మహిళా కార్మికులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు రమేష్, రమ, సోమన్న, ఈశ్వరరావు, సుధాకర్, జె. వెంకటేష్, కవిత, జిల్లా నాయకులు జి. శ్రీనివాసులు, వెంకన్న, రాజశేఖర్, సత్యనారాయణ, రమేష్, సంతోష్, నర్సింగరావు, టియుసిఐ నేత ప్రవీణ్, ఐఎఫ్టియు నేతలు శివబాబు, అరుణ, ఏఐటీయూ నాయకుడు సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : పొట్లపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## నాచారంలో దోమల నియంత్రణకు చర్యలు

- హెచ్ఎంటీ నగర్ పెద్ద చెరువును పర్యవేక్షించిన కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్

నాచారం, డిసెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు):

ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్ పరిధిలో దోమలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ఎంటమాలజీ సిబ్బందితో కలిసి హెచ్ఎంటీ నగర్ పెద్ద చెరువును పర్యవేక్షించారు.ఈ సందర్భంగా పెద్ద చెరువులో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగిందని, దాని కారణంగానే ఇటీవల కాలంలో దోమల సంఖ్య అధికంగా పెరిగిందని కార్పొరేటర్ గుర్తించారు. వెంటనే గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించేందుకు ప్రత్యేక మిషన్ ఏర్పాటు చేయాలని ఎస్ఈ ఎంటమాలజీ మాధవరెడ్డిని ఫోన్ ద్వారా సూచించారు. దీనికి స్పందించిన ఎస్ఈ ఎంటమాలజీ మాధవరెడ్డి, త్వరలోనే ఎఫ్టీసీ మిషన్‌ను తీసుకువచ్చి గుర్రపు డెక్కను పూర్తిగా తొలగిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్వైజర్ నరసింహ, బీఆర్ఎస్ నాయకులు కట్ట బుచ్చన్న గౌడ్, చంద్రశేఖర్, దాసరి కర్ణ, మక్బూల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పిసిపిఎన్‌డిటి నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి



- జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశంలో అధికారుల ఆదేశం

మేడ్చల్ మల్కాజ్గిరి, డిసెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు)

జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ (పిసిపిఎన్‌డిటి) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని ప్రైవేట్ వైద్యసంస్థల్లో పిసిపిఎన్‌డిటి (గర్భధారణ పూర్వ మరియు గర్భస్థ పిండ నిర్ధారణ నిషేధ చట్టం) నిబంధనల అమలు, రిజిస్ట్రేషన్, రీన్యువల్ ప్రక్రియలపై సమగ్రంగా చర్చించారు. ఇటీవల నిర్వహించిన తనిఖీల నివేదికలు, తీసుకున్న చర్యలపై అధికారులు వివరించారు. స్కాన్‌లు నిర్వహిస్తున్న ప్రతి ప్రైవేట్ వైద్యసంస్థ తప్పనిసరిగా పిసిపిఎన్‌డిటి రిజిస్ట్రేషన్ / రీన్యువల్ పూర్తి చేసుకోవాలని స్పష్టం చేశారు.లింగ నిర్ధారణ లేదా పిసిపిఎన్‌డిటి చట్టాన్ని ఉల్లంఘించిన వ్యక్తులు, సంస్థలపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని సమావేశంలో హెచ్చరించారు.నిబంధనల అమలు, రికార్డుల నిర్వహణ, ప్రమాణాలు, పరికరాలు, మానవ వనరులు, రిజిస్ట్రేషన్‌కు అవసరమైన పత్రాలపై వైద్యసంస్థలకు ఇవ్వాల్సిన సూచనలను కమిటీ నిర్ణయించింది.ఈ సందర్భంగా కొత్తగా దాఖలైన మరియు రీన్యువల్ అప్లికేషన్లను కమిటీ పరిశీలించి ఆమోదించి, తదుపరి ఉత్తర్వుల కోసం జిల్లా కలెక్టర్‌కు పంపింది. అలాగే పిసిపిఎన్‌డిటి, సరోగసి, ఎంటిపి (మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ) అంశాలపై కూడా చర్చించి, తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేసింది.సమావేశానికి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి & కమిటీ కన్వీనర్ డా. ఉమా గౌరి, గైనకాలజిస్ట్ డా. స్వర్ణలత, జనిటిసిస్ట్ డా. స్వర్ణలత, ప్రోగ్రాం అధికారులు డా. గీత, డా. పవన్, డిప్యూటీ డెమో వసంత రెడ్డి, సెక్షన్ సిబ్బంది హాజరయ్యారు.





## జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా తృతీయ మహాసభలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మామిడి సోమయ్య
- టిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా నూతన అధ్యక్షుడిగా టి. సంతోష్ చక్రవర్తి ఎన్నిక

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 15(తెలంగాణ ముచ్చట్లు)**: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అర్హత కలిగిన వర్కింగ్ జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాల సాధన కోసం ప్రభుత్వంతో రాజ్యాంగ బద్దంగా పోరాడుతామని, అందుకు జర్నలిస్టులంతా ఐక్య కార్యాచరణకు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. టీడబ్ల్యూజేఎఫ్ ఎప్పటికీ జర్నలిస్టుల పక్షానే నిలుస్తుందనీ, పాలకుల పక్షం కాదని ఆయన స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, రక్షణే ధ్యేయంగా సమస్యలపై పోరాడుతుందని పేర్కొన్నారు.
ఆదివారం ఖమ్మంలోని సిటీ సెంట్రల్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా తృతీయ మహాసభ ఘనంగా జరిగింది. జిల్లా అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ టి. సంతోష్ చక్రవర్తి అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో మామిడి సోమయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా సంఘం బాధ్యులు, సభ్యులు సంఘ నియమ నిబంధనలకు లోబడి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, స్థానిక జర్నలిస్టుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వృత్తిలో నైపుణ్యత, పనిలో పట్టుదల, క్రమశిక్షణతో కర్తవ్యాలు నిర్వర్తించడం ద్వారా సంఘ ప్రతిష్టను మరింత పెంచాలని ఆయన కోరారు. సంఘాన్ని దెబ్బతీసేలా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తప్పులు చేసే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమవ్వకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా, మండల కేంద్రాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులపై కుటుంబ పోషణ భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత టీఆర్ఎస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యలను నిర్లక్ష్యం చేశాయని, అదే బాటలో ప్రస్తుత ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా 'పాత్రికేయుల పోరు యాత్ర' చేపట్టక తప్పదని హెచ్చరించారు. టీడబ్ల్యూజేఎఫ్ ఏ రాజకీయ పార్టీకి లేదా ఏ ఒక్క మీడియా సంస్థకు అనుబంధం కాదని, జర్నలిస్టులందరికీ చెందిన సంఘమని పునరుద్ఘాటించారు. భయపడకుండా ధైర్యంగా సమిష్టిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.
ఈ మహాసభలో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) కార్యదర్శి పులిపలుపుల ఆనందం, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కోకన్వీనర్లు వల్లాల జగన్, తన్నీరు శ్రీనివాస్, కుడితాడు బాపురావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వి.రాజేందర్, పాల్వాయి జానయ్య తదితరులు ప్రసంగించారు. ఖమ్మం జిల్లా ఫెడరేషన్ నాయకులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్, అంతోటి శ్రీనివాస్, వందనపు సామ్రాట్, లీగల్ అడ్వయిజర్ పసుపులేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా నూతన కమిటీ ఎన్నిక**

ఖమ్మంలో జరిగిన తృతీయ మహాసభలో టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా టి. సంతోష్ చక్రవర్తి, కార్యదర్శిగా నానబాల రామకృష్ణ, కోశాధికారిగా అర్వపల్లి నగేష్, ఉపాధ్యక్షులుగా అంతోటి శ్రీనివాస్, మందడపు మనోహర్, వేల్పుల నాగేశ్వర రావు, సంయుక్త కార్యదర్శులుగా కొదుమూరి భద్రయ్య, కుంభం రవి కుమార్ లు ఎన్నికయ్యారు. అలాగే జిల్లా కార్యవర్గ సభ్యులుగా అమరబోయిన ఉపేందర్, కాసోజు శ్రీధర్, కప్పల మధు, కందబోయిన నాగకృష్ణ, వేములకొండ రమేష్, మల్లెల శిల్ప, నైని స్వాతి తదితరులు ఎన్నికయ్యారు. తెలంగాణ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టీబీజేఏ) జిల్లా అధ్యక్షుడిగా వందనపు సామ్రాట్ గుప్తా ఎన్నికయ్యారు.

### టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభ తీర్మానాలు

**తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఇస్తున్న పరిహారం మాదిరిగానే, మృతి చెందిన జర్నలిస్టులకు కూడా రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి తక్షణమే అమలు చేయాలని, జర్నలిస్టుల పిల్లలకు సాధారణ ప్రైవేట్ పాఠశాలల నుంచి ఇంటర్నేషనల్ పాఠశాలల వరకు ఉచిత విద్యా సదుపాయం కల్పించాలని కోరుతూ, మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. మూతపడిన ఇండిపెండెంట్ జర్నలిస్టుల సైట్‌ను వెంటనే తెరిపించి, గతంలో అర్హత పొందిన లిస్టులో ఉన్న జర్నలిస్టులందరికీ బేషరతుగా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు, ప్రైవేట్ హాస్పిటల్స్‌లో హెల్త్ కార్డులు పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టుల ఉద్యోగ భద్రత, భౌతిక భద్రతకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేసింది. అలాగే రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయాలని, అపరిష్కృతంగా ఉన్న ఇండ్లస్థలాల సమస్యను తక్షణమే పరిష్కరించి ప్రభుత్వంతో సత్వర చర్చలు చేపట్టాలని, జర్నలిస్టులకు న్యాయ రక్షణ సెల్ ఏర్పాటు చేయాలని, అన్ని కమిటీలలో మహిళా జర్నలిస్టులకు తగిన ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు విధి నిర్వహణలో ఉన్న మహిళా జర్నలిస్టులు రాత్రి వేళ ఇంటికి చేరుకునే సమయంలో రవాణా భద్రతను ప్రభుత్వం తప్పనిసరిగా కల్పించాలని ఈ మహాసభ గట్టిగా డిమాండ్ చేసింది.**

## కాకరవాయి ఉపసర్పంచ్‌గా కొత్తపల్లి వినోద ఏకగ్రీవ ఎన్నిక..

- గ్రామ అభివృద్ధికి సర్పంచ్‌తో కలిసి పనిచేస్తాం..వినోద..

ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు)

తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో ఇటీవల నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ అభ్యర్థి కొత్తపల్లి వినోద ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామానికి చెందిన మొత్తం 12 మంది వార్డు సభ్యులు సమావేశమై ఏకగ్రీవ తీర్మానం ద్వారా ఆమెను ఉపసర్పంచ్‌గా ఎన్నుకున్నారు.ఉపసర్పంచ్‌గా ఎన్నికైన సందర్భంగా గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.



ఈ సందర్భంగా కొత్తపల్లి వినోద మాట్లాడుతూ..తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సర్పంచ్‌తో కలిసి గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలు, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్యుత్, ఉపాధి వంటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. ప్రజా సమస్యలపై రాజీపడకుండా కమ్యూనిస్టు ఉద్యమ స్ఫూర్తితో పోరాటం కొనసాగిస్తామని, గ్రామంలోని పేదలు, కార్మికులు, రైతులు, మహిళల హక్కుల కోసం సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ తరఫున బలమైన గొంతుగా నిలుస్తానని ఆమె స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధిగా గ్రామ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ పారదర్శక పాలన అందించేందుకు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీకి చెందిన స్థానిక నాయకులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, న్యూ డెమోక్రసీ మండల నాయకులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొని ఆమెను అభినందించారు. కాకరవాయి గ్రామ అభివృద్ధిలో ఈ ఎన్నిక కొత్త ఉత్సాహాన్ని తీసుకొస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.





## కాప్రా మున్సిపల్ డీసీ జగన్‌పై సర్వత్రా నిరసనలు

- కాప్రా సర్కిల్ కార్యాలయంలో తీవ్ర ఉద్రిక్తత
- ఏసీపీ, సీఐల జోక్యంతో దిగివచ్చిన డీసీ

కాప్రా, డిసెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు):

ఉప్పల్ నియోజకవర్గం జిహెచ్ఎంసి కాప్రా మున్సిపల్ డీసీ జగన్ వ్యవహార శైలిపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఆయన నియంతలా ప్రవర్తిస్తున్నారని స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజన నేపథ్యంలో సోమవారం కాప్రా సర్కిల్ కార్యాలయంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.డివిజన్-16కు కుషాయిగూడ పేరు పెట్టాలని కోరుతూ కుషాయిగూడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారీ ఆందోళన చేపట్టారు. అదే విధంగా జమ్మిగడ్డను ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేయాలి అంటూ జమ్మిగడ్డ కాలనీల వాసులు మరో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ రెండు డిమాండ్ల సాధన కోసం దాదాపు 300 మంది ఆందోళనకారులు సర్కిల్ కార్యాలయాన్ని ముట్టడించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం ఉండటంతో డీసీ తన చాంబర్‌లోనే ఉన్నారు. కిందికి వచ్చి ఆందోళనకారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించాలని కోరినా, డీసీ నిరాకరించారు. దీంతో డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఇద్దరు లేదా ముగ్గురు మాత్రమే వచ్చి వినతిపత్రాలు సమర్పించాలని డీసీ సూచించగా, ఆందోళనకారులు అంగీకరించలేదు.ఇరుకైన గదిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడంపై గతంలోనే సమావేశ మందిరంలో నిర్వహించాలని సూచనలు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆందోళనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. వందలాది మంది సమస్యలు చెప్పుకునేందుకు రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు. డీసీ కిందికి వచ్చి వినతి పత్రాలు స్వీకరించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.ఈ క్రమంలో సర్కిల్ కార్యాలయంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న కుషాయిగూడ ఏసీపీ వెంకట్ రెడ్డి, సీఐ భాస్కర్ రెడ్డి జోక్యం చేసుకుని డీసీని కిందికి రప్పించారు. డీసీ ఇరు వర్గాల వాదనలు విని వినతిపత్రాలు స్వీకరించడంతో ఆందోళన సద్దుమణిగింది. అయితే ఈ సందర్భంగా ఆందోళనకారులు డీసీకి వ్యతిరేకంగా ఘాటైన నినాదాలు చేశారు.

## సైబర్ మోసాల పట్ల అప్రమత్తం

- పోలీస్ కమిషనర్ సునీల్ దత్

ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 15, (తెలంగాణ ముచ్చట్లు)



ఆకర్షణీయమైన ప్రకటనలతో సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ప్రారంభమైన "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" పేరుతో నిర్వహిస్తున్న సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాలపై రూపొందించిన అవగాహన పోస్టర్లను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోస్టర్ల ద్వారా జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆటోల ద్వారా మైక్ ల ద్వారా మాల్స్, రైల్వే స్టేషన్స్ బస్టాండ్, రద్దీ ప్రాంతాలలో సైబర్ నేరాలపై ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు
ప్రజలకు అర్థమయ్యేలా రూపొందించిన సైబర్ నేరాల పోస్టర్లకు అన్ని రద్దీ ప్రాంతాలలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.
ప్రధనంగా డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాల పట్ల మరింత జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అదేవిదంగా నకిలీ ఆన్లైన్ ట్రేడింగ్ యాప్లు, వెబ్ సైట్లు రూపొందించి, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని, వాట్సాప్. టెలిగ్రామ్, ఫేస్బుక్, ఇమెయిల్ ద్వారా లింక్ పంపుతూ.. మోసపూరిత వాగ్దానాలతో చేసి డబ్బు బదిలీ చేయించుకుని మోసం చేశారని పోలీస్ స్టేషన్లకు ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి మోసపురిత ఆఫర్లను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. మోసగాళ్లు పెద్ద కంపెనీ ఐపిఓ వచ్చిందని నమ్మదగిన ప్రకటనలు, నకిలీ వెబ్ సైట్ లు సృష్టిస్తారు. ఆ లింక్ లేదా ఫారమ్ ద్వారా బ్యాంక్ అకౌంట్ వివరాలు, ఆధార్,పాన్ లేదా యుపిఐ ద్వారా చెల్లింపులు చేయమని చెబుతారు. డబ్బు బదిలీ చేసిన తర్వాత మోసగాళ్లు వెబ్ సైట్ మూసేసి మాయం అవుతారు.కొన్నిసార్లు నకిలీ షేర్ సర్టిఫికేట్లు లేదా రసీదులు కూడా పంపి మోసం చేస్తారు.
సోషల్ మీడియా, వ్యక్తిగత మెసేజ్ ల ద్వారా వచ్చిన ఐ పి ఓ ఆఫర్లను నమ్మవద్దని,ఎవరైనా ముందుగా "అడ్వాన్స్ పేమెంట్" లేదా "రిజిస్ట్రేషన్ ఫీజు" అడిగితే డబ్బు పంపవద్దని సూచించారు. తక్కువ పెట్టుబడితో లాభాలు వస్తాయని సోషల్ మీడియా, యూట్యూబ్ వీడియోలు, వాట్సాప్ గ్రూపులు లేదా టెలిగ్రామ్ ఛానెల్ ల ద్వారా "రోజుకు వేలల్లో లాభం", "100% రిటర్న్" అంటూ ప్రకటనలు చేస్తారు. మొదట యాప్ లేదా వెబ్ సైట్లో రిజిస్టర్ చేయమని చెబుతారని, చిన్న మొత్తంలో పెట్టుబడి పెట్టగానే కొంత లాభం చూపించి నమ్మకం కలిగిస్తారని అన్నారు. ఆ తరువాత పెద్ద పెట్టుబడి పెట్టమని ప్రోత్సహిస్తారు. విత్‌డ్రా చేయాలంటే "ట్యాక్స్", "సర్వీస్ చార్జ్" పేరుతో డబ్బు అడుగుతారు. చివరికి వెబ్ సైట్ లేదా యాప్ యాక్సెస్ నిలిపివేసి, డబ్బుతో మాయమవుతారని అన్నారు. ఎవరైనా వీడియో కాల్, వాట్సాప్ లేదా మెసేజ్ ద్వారా పెట్టుబడి పెట్టమని ఒత్తిడి చేస్తే వెంటనే కాల్ కట్ చేసి పిర్యాదు చేయండి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


## రాహుల్ పార్థీవదేహానికి నివాళులు అర్పించిన బీఆర్ఎస్ యువనాయకులు రాజు


**ధర్మసాగర్,డిసెంబర్15(తెలంగాణ ముచ్చట్లు):** మండలంలోని మల్లక్ పల్లి గ్రామానికి చెందిన మంద రాహుల్ బైక్ ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా మంద రాహుల్ పార్థివదేహానికి స్థానిక యువజన నాయకుడు తాటికాయల రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఆయన సూచించారు.మంద రాహుల్ మృతి గ్రామంలో విషాదఛాయలు అలుముకునేలా చేసింది.



## క్రిటికల్ పోలింగ్ స్టేషన్ సందర్శించిన కల్లూరు ఏసీపీ

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 15, తెలంగాణ ముచ్చట్లు;**

మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వియం బంజారా మండలంలోని పలు క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్ సందర్శించారు. బందోబస్త్ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా ప్రతిఒక్కరు సమన్వయం పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని, శాంతియుత ఎన్నికల నిర్వహణకు అభ్యర్థులు, స్థానిక ప్రజలకు,రాజకీయ నాయకులు సహకారం అందించాలన్నారు.









## నైపుణ్యతతో విజయాలు సొంతం...

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ -15 (తెలంగాణ ముచ్చట్లు)**

విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగంలో నైపుణ్యతను పెంచుకుంటే జీవితంలో విజయాలు సొంతం అవుతాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.

సోమవారం ఏదులాపురం మున్సిపాలిటీ పోలేపల్లి షిరిడి సాయినాథ్ నగర్ భద్రాద్రి కాలనీలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో ఇన్నోవేషన్ అండ్ స్కిల్ సెంటర్ ను ప్రారంభించి, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఫౌండేషన్ డే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అత్యున్నత విద్యను ప్రభుత్వ రంగంలో అందించే సంస్థలుగా కేంద్రీయ విద్యాలయాలకు మంచి పేరు ఉందని, కేంద్రీయ విద్యాలయాలలో అడ్మిషన్ల కొరకు కలెక్టర్ గా తనకు అనేక దరఖాస్తులు వస్తాయని, ఈ విద్యాలయంలో చదవాలని బయట మంచి డిమాండ్ ఉందని అన్నారు. కేంద్రీయ విద్యాలయాల్లో చదివేందుకు అవకాశం వచ్చిన ప్రతి విద్యార్థి అదృష్టవంతుడని, చిన్నతనంలో తనకు ఇటువంటి మంచి విద్యాలయాల్లో చదువుకునే అవకాశం లభించలేదని కలెక్టర్ తెలిపారు. మన దగ్గర ఉన్న సదుపాయాలను ఎంత మెరుగ్గా వినియోగించుకుంటా మనే దానిపై మన సక్సెస్ ఆధారపడి ఉంటుందని కలెక్టర్ అన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో చదివే విద్యార్థులు క్రీడలలో, అకడమిక్స్ లో సమాంతరంగా రాణిస్తున్నారని తెలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. దేశంలో మంచి పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దుతూ వారి సమగ్ర అభివృద్ధికి కేంద్రీయ విద్యాలయాలు దోహద పడుతున్నాయని అన్నారు. జీవితంలో మనం విజయాల వెనుక పరిగెత్త వద్దని, మనకు ఆసక్తి ఉన్న రంగాలలో విశిష్టమైన నైపుణ్యత పెంచుకుంటే విజయాలు వాటంతటవే మనకు వస్తాయని తెలిపారు. సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ వంటి క్రీడాకారులు సైతం ఒకే రోజు గొప్పవారు కాలేదని, రెగ్యులర్ గా ప్రాక్టీస్ చేస్తూ తమ నైపుణ్యతకు పదును పెట్టడం వల్ల అనేక విజయాలు సాధించారని, వారి నుంచి మనం ఆ స్ఫూర్తి నేర్చుకోవాలని కలెక్టర్ తెలిపారు.

విద్యార్థులు ఎల్లప్పుడూ ఏ లక్ష్యాన్ని అసాధ్యంగా భావించవద్దని, చిన్నతనంలో తాను కూడా సివిల్ సర్వీసెస్ పెద్ద పెద్ద స్కూల్స్ లో చదివే వారి కోసమేనని భావించానని, రోజులు గడిచే కొద్దీ తాను కూడా ఇతరులతో పోటీ పడవచ్చని భావించి సివిల్స్ పరీక్షలు రాశానని, పలుమార్లు వైఫల్యం చెందినప్పటికీ చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ మరోసారి ప్రయత్నించడం వల్ల విజయం సాధించానని కలెక్టర్ తెలిపారు.

మనకు ఆసక్తి గల రంగంలో నైపుణ్యత సాధించడం కోసం చాలా కష్టపడాల్సి ఉంటుందని, అదే సమయంలో మనపై నమ్మకం ఎప్పుడు వదలవద్దని, కష్టం, నమ్మకం కలిస్తే ఎంత పెద్ద లక్ష్యమైన సాధ్యం అవుతుందని అన్నారు. నైపుణ్యత పెంపొందించుకోవడం జీవితాంతం కొనసాగించాలని, విజయాలు జీవన ప్రయాణంలో ఒక భాగంగా మాత్రమే పరిగణించాలని కలెక్టర్ తెలిపారు. అంతకుముందు పీఎం శ్రీ కేంద్రీయ పాఠశాల చైర్మన్ అయిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విద్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం జిల్లా కలెక్టర్ విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, మెమోంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరెడ్డి, డివైఎస్ఓ సునీల్ రెడ్డి, ప్రిన్సిపాల్ కవీంద్రరాయ్, టీచర్లు నసీరుద్దీన్ బాబా, సిహెచ్. నరేంద్ర కుమార్, అనిల్ భట్, తన్మాయి, ఊర్మిళ, విభాష, మమత, త్రినేత్ర తదితరులు పాల్గొన్నారు.





## సర్పంచ్‌గా మమతకు మద్దతుగా ఇంటింటా ప్రచారం

**ఎర్రబెల్లి బండారి లక్ష్మారెడ్డి**

**ఉప్పల్, డిసెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు):**

పాలకుర్తి మండల పరిధిలోని తిరుమలగిరి గ్రామ సర్పంచ్‌గా చేరుపల్లి మమతను భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు.సోమవారం సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వారు గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను కలిసి మమతకు మద్దతు తెలపాలని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కలిసి పనిచేయాలని కోరారు.కేసీఆర్ నాయకత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, గ్రామాభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి చైతన్యపరచాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయకేతనం బీఆర్ఎస్‌దేనని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సెలెన్స్ పురస్కారం అందుకున్న బోనకల్ షైన్ హై స్కూల్..

- పురస్కారం అందుకున్న పాఠాశాల ప్రిన్సిపాల్,కరస్పాండెంట్

**ఖమ్మం బ్యూరో ,డిసెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు)**

స్థానిక షైన్ హై స్కూల్ హైదరాబాద్ హైటెక్స్ లో బ్రెయిన్ ఫీడ్ సంస్థ నిర్వహించిన ఆరవ జాతీయ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ రిసోర్సెస్ టెక్ ఎక్స్పో 2025 పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండంట్ అన్సర్ పాషా, ప్రిన్సిపాల్ శ్వేత స్కూల్ ఎక్సెలెన్స్ అవార్డు అందుకున్నారు.విద్యార్థుల విద్య పట్ల అంకిత భావం తో పనిచేస్తున్నందుకు గాను,పాఠశాల లో విద్యార్థులకు పలు విద్య వనరులతో విద్య అందిస్తున్నందుకు గాను,పిల్లలకు సృజనత్మక విద్య అందిస్తున్నందుకు గాను ఈ పురస్కారం లభించింది... ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండంట్ అన్సర్ పాషా మాట్లాడుతూ ఈ అవార్డు తీసుకున్నందుకు చాలా సంతోషం గా ఉందని, ఈ అవార్డ్స్ అందచేసిన బ్రెయిన్ ఫీడ్ సంస్థకు ధన్యవాదములు తెలిపారు....ఈ పురస్కారం అందుకున్నందుకు పాఠశాల డైరెక్టర్ లాల్ మహమ్మద్, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు పలు పాఠశాలల కరెస్పాండంట్ లు అభినందనలు తెలిపారు...








## కూరగాయల సాగులో మెళకువలపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం

**మేడ్చల్–మల్కాజిగిరి, డిసెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా వాతావరణానికి అనువైన వంగడాల పెంపకం, కూరగాయల నిల్వ కాలాన్ని పెంచే విధానాలు, పంట అనంతరం తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై తెలంగాణ ప్రభుత్వం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో "కూరగాయల సాగులో మెళకువలు" అనే మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నుంచి ఇండో-ఇజ్రాయిల్ అగ్రికల్చర్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఉద్యానశాఖ జాయింట్ డైరెక్టర్ రామలక్ష్మి తెలిపారు.జీడిమెట్లలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ వెజిటెబుల్స్ అండ్ ఫ్లవర్స్‌లో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఇజ్రాయిల్ ఎంబస్సీ అగ్రికల్చర్ అటాచ్ మాషావ్ ఉరిరాబిన్ స్టీన్, డ్యానిల్ హదాద్ (ఎంబస్సీ ఆఫ్ ఇజ్రాయిల్), జిల్లా ఉద్యాన శాఖాధికారి శ్రీధర్‌తో పాటు 12 రాష్ట్రాల నుంచి 40 మంది ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ రామలక్ష్మి మాట్లాడుతూ, కూరగాయలు మరియు పూల సాగులో రైతులకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరమని అన్నారు. కార్యక్రమంలో మట్టిరహిత కూరగాయల సాగు, బిందు సేద్యం ప్రాముఖ్యత, నీటిలో కరిగే ఎరువుల యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వాతావరణానికి అనుగుణమైన వంగడాల ఎంపిక, కూరగాయల నిల్వ కాలం పెంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంట కోత అనంతరం పాటించాల్సిన పద్ధతులపై ప్రతినిధులు సుబ్బారావు, శేశ్‌నాథ్ వివరించారు. కూరగాయల్లో నులిపురుగుల నివారణపై పీడీ మాణిక్యరావు సూచనలు అందించారు.భారత ప్రభుత్వ అగ్రికల్చర్ పీడీ బ్రహ్మదేవ్ కూరగాయల అంటుకట్టుట సూత్రాలు,అభ్యాసం,కూరగాయలు-పూల సాగులో వివిధ రకాల ఉపయోగాలపై వివరించారు. డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ యాస్మిన్ బాషా, ఐఏఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్‌గా పాల్గొని, అధికారులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణికి 107 ఫిర్యాదులు

- పెండింగ్ అర్జీలను తక్షణమే పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

**మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్, డిసెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి స్వీకరించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 107 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందజేసే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు సీరియస్‌గా తీసుకుని తక్షణమే స్పందిస్తూ పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు.వినతుల పై చేపట్టిన చర్యలను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని, అలాగే ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే క్లియర్ చేయాలని తెలిపారు.ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులకు స్పష్టం చేశారు. అదేవిధంగా సీఎంఓ ప్రజావాణికి సంబంధించిన పెండింగ్ కేసులను కూడా వేగవంతంగా పరిష్కరించాలని వివిధ శాఖల అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# జమ్మిగడ్డను ప్రత్యేక డివిజన్‌గా ప్రకటించాలి

- రాధిక నుంచి ఈసీఐఎల్ జీహెచ్ఎంసీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ

**కాప్రా, డిసెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మిగడ్డ ప్రాంతాన్ని ప్రత్యేక డివిజన్ గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు చేపట్టిన ఉద్యమం ఉద్ధృతంగా కొనసాగుతోంది. రెండు రోజుల రిలే నిరాహార దీక్ష అనంతరం మూడవ రోజు సోమవారం జమ్మిగడ్డ ప్రాంతానికి చెందిన సుమారు 300 మందికి పైగా ప్రజలు భారీ ర్యాలీ నిర్వహించారు.జమ్మిగడ్డ సాధన సమితి ఆధ్వర్యంలో డప్పు చప్పులతో ప్రారంభమైన నిరసన ర్యాలీ ఎన్‌టిఆర్ విగ్రహం నుంచి రాధిక మీదుగా ఈసీఐఎల్ చౌరస్తా, కుషాయిగూడ పోలీస్ స్టేషన్ మార్గంలో కాప్రా సర్కిల్ కార్యాలయానికి చేరుకుంది. జమ్మిగడ్డలోని అన్ని కాలనీలను కలిపి ప్రత్యేక డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం జమ్మిగడ్డ ప్రాంతం పలు డివిజన్లలో విభజించబడటం వల్ల మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులు సక్రమంగా జరగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేస్తే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు.సర్కిల్ కార్యాలయం ఎదుట నిరసనకారులు ముక్తకంఠంతో నినాదాలు చేస్తూ బైఠాయించి ధర్నా చేపట్టారు. దాదాపు రెండు గంటల పాటు నినాదాలతో పరిసర ప్రాంతం దద్దరిల్లింది. అనంతరం డిప్యూటీ కమిషనర్ జగన్ బయటకు వచ్చి వినతి పత్రాన్ని స్వీకరించారు. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. జమ్మిగడ్డను ప్రత్యేక డివిజన్‌గా ప్రకటించకపోతే మరింత ఉధృతమైన ఉద్యమం చేపడతామని ఉద్యమకారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జమ్మిగడ్డ ప్రాంతానికి చెందిన కాలనీల ప్రతినిధులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మణిగిల్ల గ్రామ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- మణిగిల్ల గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్



**పెద్దమందడి,డిసెంబర్15(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే తన లక్ష్యమని మణిగిల్ల గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గ్రామ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని సద్వినియోగం చేసుకుంటూ, సమగ్ర గ్రామాభివృద్ధి దిశగా పనిచేస్తానని స్పష్టం చేశారు.గ్రామంలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, వీధిదీపాలు, విద్యా-వైద్య సౌకర్యాలు, పచ్చదనం పెంపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆయన పేర్కొన్నారు. గ్రామ సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తామని అన్నారు.పేదలు, రైతులు, మహిళలు, యువతకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ పాలనలో పారదర్శకత, బాధ్యతాయుతమైన వ్యవహారమే మార్గదర్శకంగా ఉంటుందని సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిఆర్ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, ముఖ్యంగా బిఆర్ఎస్ నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు గ్రామస్థుల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకొస్తున్నాయని అన్నారు. బిఆర్ఎస్ తో కలిసి పనిచేస్తూ మణిగిల్ల గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు.గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సహకారంతో మణిగిల్ల గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## పెద్దమందడి గ్రామ ప్రగతే లక్ష్యంగా ముందడుగు

పెద్దమందడి గ్రామ సర్పంచ్ సూర్య గంగా



**పెద్దమందడి,డిసెంబర్15(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి గ్రామాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లడమే తన ముఖ్య లక్ష్యమని పెద్దమందడి గ్రామ సర్పంచ్ సూర్య గంగా తెలిపారు. గ్రామ ప్రజలు తనపై ఉంచిన విశ్వాసాన్ని బాధ్యతగా తీసుకుని, ప్రణాళికాబద్ధమైన పాలనతో గ్రామానికి కొత్త గుర్తింపు తీసుకొస్తానని అన్నారు.గ్రామంలో తాగునీటి సరఫరా మెరుగుదల, పారిశుద్ధ్య నిర్వహణ, అంతర్గత రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ సమస్యల పరిష్కారం, వీధిదీపాల విస్తరణతో పాటు విద్యా-వైద్య సౌకర్యాల బలోపేతానికి ప్రాధాన్యత ఇస్తామని ఆమె పేర్కొన్నారు. ప్రతి సమస్యను గ్రామస్థులతో చర్చించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రత్యేక చర్యలు చేపడతామని, ముఖ్యంగా మహిళలు, రైతులు, యువతకు మేలు చేసే కార్యక్రమాలపై దృష్టి సారిస్తామని సర్పంచ్ సూర్య గంగా చెప్పారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..స్థానిక ఎమ్మెల్యే మేఘా రెడ్డి సహకారంతో గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు, మౌలిక సదుపాయాలను సమకూర్చి పెద్దమందడి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, పారదర్శకతతో కూడిన పాలన అందించడమే లక్ష్యమని, గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో పెద్దమందడిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

## తవ్వకాల్లో బయటపడ్డ అమ్మవారి విగ్రహం

ప్రత్యేక పూజలకు భారీగా జనం తరలిరాక

**మంచిర్యాల,డిసెంబర్ 15(తెలంగాణ ముచ్చట్లు):** మంచిర్యాల జిల్లాలో తవ్వకాల్లో అమ్మవారి విగ్రహం బయటపడిరది. గోదావరి పరిక్రమ యాత్రలో భాగంగా నేలమాలిగ గ్రామానికి వచ్చిన స్వామిజీలు చెప్పిన మాట మేరకు సోమవారం తవ్వకాలు జరపడంతో దుర్గాదేవి విగ్రహం కనిపించింది. ప్రత్యేక పూజల అనంతరం నిర్వహించిన ఈ తవ్వకాలను చూసేందుకు జనాలు భారీగా తరలివచ్చారు. తవ్వకాలు జరుపుతున్న సమయంలో కొంతమంది భక్తులు పూనకాలతో ఊగిపోయారు. గోదావరి పరిక్రమ యాత్రలో భాగంగా ఈ నెల 12వ తేదీన మంచిర్యాల జిల్లాకు అయోధ్యలోని శ్రీరామ మందిరంలోని పూజారితో పాటు వారణాసి, ఉత్తరప్రదేశ్‌కు చెందిన పీఠాధిపతులు, పలువురు స్వాములు వచ్చారు. ఈ సందర్భంగా ముల్కల మండలం నేలమాలిగలోని గోదావరి తీరంలో పుష్కరఘాట్‌కు వెళ్లే మార్గంలోని ఓ ప్రదేశాన్ని చూపించి, అక్కడ ఏదో తెలియని శక్తి ఉందని తెలిపారు. దీనికి సంబంధించిన వీడియోలు ఇటీవల సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో స్థల యజమాని అనుమతి తీసుకున్న స్థానికులు, ఇవాళ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తవ్వకాలు జరిపారు. ఈ తవ్వకాల్లో సింహంపై కూర్చున్న దుర్గామాత విగ్రహం బయటపడిరది. ఈ విషయం తెలిసి మంచిర్యాల పట్టణ ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చి, అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిజీ చెప్పినట్లుగా అక్కడ దుర్గామాత విగ్రహం బయటపడటంతో గ్రామస్తులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది తమ గ్రామం చేసుకున్న అదృష్టమని చెబుతున్నారు.

## జోర్డాన్ చేరుకున్న ప్రధాని మోడీ

- ఘనంగా స్వాగతించిన భారత సంతతి ప్రజలు

**అమ్మాన్,డిసెంబర్15(తెలంగాణ ముచ్చట్లు):** భారతీయ సంతతి భారత్`జోర్డాన్ సంబంధాలకు గణనీయమైన కృషి చేస్తున్నారని భారత ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ప్రధాని మోదీకి జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లో భారతీయ సంతతి నుంచి అపూర్వ స్వాగతం లభించింది. మూడు దేశాల పర్యటనలో భాగంగా సోమవారం మొదటి జోర్డాన్‌కు చేరుకున్న ప్రధాని మోదీని హోటల్ వద్ద జోర్డాన్ లోని భారత సంతతికి చెందిన వారు భారత జాతీయ జెండాను చేతబట్టి ప్రధాని మోదీకి నమస్కరించి స్వాగతం చెప్పారు. ఈ సందర్భంగా ప్రధాని వారిని ప్రేమతో పలుకరించారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ డిసెంబర్ 15 నుంచి 18 వరకు జోర్డాన్, ఇథియోపియా, ఒమన్ మూడు దేశాల్లో పర్యటిస్తారు. ఈ పర్యటన ద్వారా ఆయా దేశాలతో పురాతన సంస్కృతిక సంబంధాలతో పాటు ఆధునిక ద్వైపాక్షిక భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేయాలన్నది ప్రధాని పర్యటన ప్రధాన లక్ష్యం. ప్రధాని మోదీ.. జోర్డాన్ సందర్శన భారత్`జోర్డాన్ దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జరుగుతోంది. ఈ పర్యటనలో ప్రధాని మోదీ.. జోర్డాన్ రాజు అబ్దుల్లా ఎఎ ఇబ్న్ అల్ హుస్సేన్, ఆ దేశ ప్రధాని జాఫర్ హసన్‌లతో భేటీ కానున్నారు. జోర్డాన్ పర్యటన అనంతరం ప్రధాని మోదీ ఇథియోపియా, ఒమన్ దేశాల్లో పర్యటిస్తారు.

## మద్దిగట్ల గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

- మద్దిగట్ల గ్రామ సర్పంచ్ మేకల రాములు



**పెద్దమందడి,డిసెంబర్15 (తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మద్దిగట్ల గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని మద్దిగట్ల గ్రామ సర్పంచ్ మేకల రాములు అన్నారు. గ్రామ ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి తగ్గట్టుగా పనిచేస్తూ, గ్రామాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతానని స్పష్టం చేశారు.సోమవారం ఒక ప్రకటనలో సర్పంచ్ మేకల రాములు మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, రహదారులు, వీధిదీపాలు, డ్రైనేజీ, పచ్చదనం వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. గ్రామంలో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందిస్తామని పేర్కొన్నారు.గ్రామంలో పేదలు, నిరుపేదలు, రైతులు, మహిళలు, యువతకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాల లబ్ధి చేరేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మేకల రాములు మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే మేఘా రెడ్డి సహకారంతో గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు, మౌలిక సదుపాయాలు సమకూర్చి మద్దిగట్ల గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని స్పష్టంగా తెలిపారు. ఎమ్మెల్యే మేఘా రెడ్డి సహకారంతో గ్రామాభివృద్ధి పనులు మరింత వేగవంతం చేస్తామని అన్నారు.ప్రజా ప్రతినిధిగా ఎల్లప్పుడూ గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటానని, గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరి సహకారం అవసరమని కోరారు. గ్రామ ప్రజల ఐక్యతతోనే మద్దిగట్లను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా నిలబెడతామని సర్పంచ్ మేకల రాములు ధీమా వ్యక్తం చేశారు.



## పామిరెడ్డిపల్లి గ్రామ సమగ్ర అభివృద్ధే లక్ష్యం

- పామిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం

**పెద్దమందడి,డిసెంబర్15 (తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని పామిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం తెలిపారు. గ్రామ ప్రజలు తనపై ఉంచిన విశ్వాసానికి తగ్గట్టుగా పనిచేస్తూ, గ్రామాభివృద్ధే కేంద్రబిందువుగా పాలన సాగిస్తానని పేర్కొన్నారు.గ్రామంలో తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ, వీధిదీపాలు, విద్య, వైద్యం, పచ్చదనం వంటి మౌలిక వసతుల అభివృద్ధికి తొలి ప్రాధాన్యత ఇస్తామని ఆయన తెలిపారు. గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు.పేదలు, రైతులు, మహిళలు, యువతకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకుంటామని, ప్రతి ఇంటికీ ప్రభుత్వ లబ్ధి చేరేలా పారదర్శకంగా వ్యవహరిస్తామని సర్పంచ్ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే మేఘా రెడ్డి సహకారంతో గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు, మౌలిక సదుపాయాలు సమకూర్చి పామిరెడ్డిపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని స్పష్టంగా తెలిపారు.గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో పామిరెడ్డిపల్లిని ఆదర్శ గ్రామంగా నిలబెడతామని మధిర మంజుల శ్రీశైలం ధీమా వ్యక్తం చేశారు.

## వెల్టూర్ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం

- వెల్టూర్ గ్రామ సర్పంచ్ అశోక్



**పెద్దమందడి,డిసెంబర్15 (తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని వెల్టూర్ గ్రామ సర్పంచ్ అశోక్ తెలిపారు. గ్రామ ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి తగ్గట్టుగా పనిచేస్తూ, అభివృద్ధే అజెండాగా పాలన సాగిస్తానని స్పష్టం చేశారు.గ్రామంలో తాగునీరు, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, వీధిదీపాలు, విద్యా-వైద్య సౌకర్యాల అభివృద్ధితో పాటు పచ్చదనం పెంపుపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆయన అన్నారు. గ్రామ సమస్యలను ప్రజలతో చర్చించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు.పేదలు, రైతులు, మహిళలు, యువతకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని, గ్రామ పాలనలో పారదర్శకత, బాధ్యతాయుతమైన నిర్ణయాలే మార్గదర్శకమని సర్పంచ్ అశోక్ అన్నారు.గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సహకారంతో వెల్టూర్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# ఇజ్రాయిల్ దాడిలో పాలస్తీనా భద్రతాధికారి మృతి

గాజా స్ట్రిప్‌లో భద్రతాధికారి అహ్మద్ జాఝామ్‌ను ఇజ్రాయిల్ కుట్రపూరితంగా హత్య చేసినట్లు హమాస్ నేతృత్వంలోని అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ ధృవీకరించింది. భద్రతాధికారి హత్యపై ఆదివారం ఒక ప్రకటనను విడుదల చేసింది. ఇజ్రాయిల్ నిఘా వర్గాలు ముందస్తుగా కుట్రపన్ని చేసిన హత్యగా ఈ దాడిని అభివర్ణించింది. దీంతో కాల్పుల విరమణ ఉల్లంఘనల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది. ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపింది.ఇజ్రాయిల్ నిఘా సంస్థల ప్రత్యక్ష పర్యవేక్షణ కింద పనిచేసే ఏజెంట్లు ఈ ఆపరేషన్‌ను నిర్వహించారని, ఇది ఉద్దేశపూర్వకంగా, ముందస్తుగా కుట్రపన్ని చేసిన హత్యగా ఆ ప్రకటనలో పేర్కొంది. అహ్మద్ జాఝామ్ మృతదేహాన్ని అల్‌అక్సా అమరవీరుల ఆస్పత్రికి తరలించినట్లు వైద్య వర్గాలు నిర్ధారించాయి. ఇజ్రాయిల్ ప్రభుత్వం రాజకీయ, భద్రతా ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని హత్య చేయడం ద్వారా గాజాను అస్థిర పరిచే వ్యూహాన్ని అనుసరిస్తోందని పాలస్తీనా అధికారులు చేసిన ప్రకటనను అల్‌మఘాజీలో జరిగిన ఈ ఘటన బలపరుస్తోంది. ఇజ్రాయిల్ డ్రోన్ దాడిలో హమాస్ సీనియర్ కమాండర్, సాయుధ విభాగ అధ్యక్షుడు రయీద్ సయీద్ సహా మరో నలుగురు మరణించిన ఒక రోజు తర్వాత ఈ హత్య జరిగింది.

# అంధులకు తోడుగా రోబో శునకం

చైనాలో కృత్రిమ మేధ వినియోగంతో అనేక ప్రజా ప్రయోజనకర ఉత్పత్తులు అందుబాటులోకి వస్తున్నాయి. ఎఐ, రోబోటిక్స్ రంగాన చైనా దూసుకుపోతోంది. ఈ క్రమంలో తాజాగా దృష్టి లోపం ఉన్న ప్రయాణికుల కోసం షెన్‌జెన్ మెట్రో ఏఐ ఆధారిత రోబోటిక్ 'గైడ్ డాగ్'ను ప్రారంభించింది. ప్రపంచ రైలు రవాణా పరిశ్రమలో ఇలాంటి సాధనాన్ని ఉపయోగించడం ఇదే మొదటిసారి అని దేశీయ మీడియా సంస్థలు తెలిపాయి. క్సియాసాన్ అని పిలవబడే ఈ స్మార్ట్ రోబోటిక్ గైడ్ డాగ్ (చిన్న వెల్లుల్లి) దక్షిణ చైనాలోని గువాంగ్‌డాంగ్ రాష్ట్రం పుటియన్ జిల్లాలో ఉన్న హువాంగ్‌ముగాంగ్ రవాణా కేంద్రంలో ట్రయల్ కార్యకలాపాలు ప్రారంభించింది. దృష్టి లోపం తక్కువగా ఉన్న వారు మెట్రో స్టేషన్లలో తిరగడానికి ఇది సహాయకారిగా వ్యవహరిస్తుంది. రైలు రవాణాలో ఇలాంటి సర్వీసును ప్రారంభించడం ఇదే ప్రథమం. వికలాంగులకు మద్దతు ఇవ్వడంలో ఏఐ పాత్రను ఇది నొక్కి చెబుతోంది. రోబోటిక్ గైడ్ డాగ్‌కు భద్రతకు సంబంధించిన పరీక్షలు, తనిఖీలు పూర్తయ్యాయి. ఒక నెల రోజుల పాటు దృష్టి లోపం ఉన్న ప్రయాణికుల వెంట సిబ్బంది ఉంటూ సహకారాన్ని అందిస్తారు. పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతం అయితే ఇతర స్టేషన్లలో కూడా దీనిని ప్రవేశపెడతారు. 12వ జాతీయ వికలాంగుల క్రీడలకు మద్దతుగా ఈ ప్రాజెక్టును రూపొందించారు.



# ఇజ్రాయిల్ చర్యలు శాంతికి విఘాతం

కాల్పుల విమరణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ ఇజ్రాయిల్ పదేపదే దాడులకు పాల్పడుతుండటం గాజా ప్రాంతంలో శాంతి ప్రయత్నాలకు తీవ్ర విఘాతం కలిగిస్తోందని హమాస్ తరపున శాంతి చర్చల్లో పాల్గన్న ప్రధాన సంధానకర్త (ఛీఫ్ నెగోషియేటర్) ఖలీల్ అల్ హయ్యా అన్నారు. ఈ నెల 13న హమాస్ కమాండర్లను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో సీనియర్ కమాండర్ రయీద్ సయీద్ హత్యకు గురైనట్లు ఖలీల్ ధ్రువీకరించారు. ఈ ఘటనపై ఆదివారం నాడు ఆయన ఒక టివి ప్రతినిధితో మాట్లాడుతూ అమెరికా మధ్యవర్తిత్వంతో గాజాలో కాల్పుల విరమణ ఒప్పదం అమల్లోకి వచ్చిన తర్వాత హమాస్ అగ్రశ్రేణి నాయకులను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ జరిపిన తొలిదాడి ఇదేనని ఆయన పేర్కొన్నారు. ఇజ్రాయిల్ పదేపదే కాల్పుల విరమణను ఉల్లంఘించి ఇలా దాడులకు తెగించడం శాంతి పక్రియకు తీవ్ర విఘాతం కల్గిస్తోందని తెలిపారు. కాల్పుల విరమణ ఒప్పందానికి హామీదారుగా ఉన్న అమెరికా ప్రభుత్వ యంత్రాంగం, ఆ దేశ అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ తక్షణమే జోక్యం చేసుకొని ఇజ్రాయిల్ కాల్పుల విరమణకు కట్టుబడివుండేలా చర్యలు తీసుకోవాలని ఖలీల్ డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్ హత్య చేసిన సయీద్ ..హమాస్‌లో అత్యంత కీలక నేత. సాయుధ దళానికి అధిపతిగా ఉన్న ఐజ్ ఎల్దీన్ అల్ హదద్ తర్వాతి నేతగా సయీద్‌కు పేరుంది. ఐక్య రాజ్యసమితి ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ స్టెబిలైజేషన్ ఫోర్స్ (ఐఎస్ఎఫ్) ఏర్పాటుపైనా హయ్యా స్పందించారు. ఐఎస్ఎఫ్ బలగాలు కేవలం కాల్పుల విరమణ ఒప్పందం అమలయ్యేలా చూడడానికి, గాజా సరిహద్దుల వెంబడి ఇరు పక్షాలను వేరు చేయడానికి మాత్రమే పరిమితం కావాలన్నారు. అంతేగానీ గాజా స్ట్రిప్‌లో ఐఎస్ఎఫ్‌కు ఎటువంటి పాత్ర ఉండరాదని, అంతర్గత వ్యవహారాల్లో ఏపాటి జోక్యం కూడా చేసుకోరాదని హయ్యా పేర్కొన్నారు.



# దక్షిణాఫ్రికాలో కూలిన అహోబిల ఆలయం

దక్షిణాఫ్రికాలో నిర్మాణంలో ఉన్న ఆలయం కుప్ప కూలిన ఘటనలో భారత సంతతికి చెందిన ఆలయ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు, నిర్మాణ ప్రాజెక్టు మేనేజర్ విక్కీ జైరాజ్ పాండే (52) సహా నలుగురు చనిపోయారు. క్వాజులు నాటల్ ప్రావిన్స్‌లోని వెరులంలో రెడ్‌క్లిప్ వద్ద ఈ ఘటన గత శుక్రవారం చోటుచేసుకుంది. శిథిలాల కింద ఎంత మంది చిక్కుకున్నారనే విషయంపై స్పష్టతలేదన్నారు. దీంతో చిక్కుకున్న వారిని బయటకు తీసుకురావడానికి శని, ఆదివారాల్లోనూ సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. టన్నులకొద్దీ శిథిలాలు ఉండటంతో.. వాటిని తొలగించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదని తెలిపారు. ఇక్కడ స్థిరపడిన ఒక హిందూ కుటుంబం 'న్యూ అహోబిలం' పేరుతో నాలుగు అంతస్థుల ఆలయ నిర్మాణాన్ని చేపట్టింది. నిర్మాణ పనుల కొనసాగుతుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో కార్మికులు, పలువురు ఆలయ అధికారులు విధుల్లో ఉన్నట్టు తెలుస్తోంది.

# కేంద్ర సమాచార కమిషన్

## ప్రధాన కమిషనర్‌గా రాజ్‌కుమార్ గోయల్

కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) నూతన ప్రధాన కమిషనర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజ్‌కుమార్ గోయల్ నియమితులయ్యారు. ఆయనతో పాటు మరో 8 మందిని కమిషనర్లుగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ చేసిన సిఫారసుల మేరకు ఈ నియామకాలు జరిగాయి. కొత్తగా నియమితులైన వారిలో సీనియర్ జర్నలిస్టులు పీఆర్ రమేశ్, అశుతోష్ చతుర్వేది, రైల్వే బోర్డు మాజీ చైర్‌పర్సన్ జయవర్మ సిన్హా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుధారాణి రేలంగి వంటి ప్రముఖులు ఉన్నారు. సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాజ్‌కుమార్ గోయల్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నియామకాలతో సీఐసీలో ఖాళీగా ఉన్న చీఫ్ సహా మొత్తం 9 పోస్టులు భర్తీ అయ్యాయి. సుమారు తొమ్మిదేళ్ల తర్వాత కమిషన్ పూర్తిస్థాయి సామర్థ్యంతో పనిచేయనుండటం గమనార్హం.గత ఏడాది సెప్టెంబర్‌లో చీఫ్ కమిషనర్ హీరాలాల్ సమరియా పదవీ విరమణ చేయగా, మిగిలిన కమిషనర్ల పోస్టులు 2023 నవంబర్ నుంచి ఖాళీగా ఉన్నాయి. అయితే, ఈ నియామకాల ఎంపిక పక్రియపై విపక్ష నేత రాహుల్ గాంధీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించలేదని ఆరోపిస్తూ ఆయన కమిటీ సమావేశంలో అసమ్మతి నోట్ సమర్పించారు.






# పుదుచ్చేరిలో కొత్త రాజకీయ పార్టీ

వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ముందు పుదుచ్చేరిలో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటయింది. లచ్చియా జననాయక కచ్చి (ఎల్‌జెకె) అనే పేరుతో వ్యాపారవేత్త జోస్ ఛార్లెస్ ఆదివారం ఒక పార్టీని స్థాపించారు. లాటరీ కింగ్‌గా పేరుగడించిన శాంటియాగో మార్టిన్ కుమారుడైన జోస్ ఛార్లెస్ తన సంస్థ జెసిఎం మక్కల మండ్రం ద్వారా గత కొన్ని నెలలుగా 'సంక్షేమ కార్యక్రమాలు' నిర్వహిస్తున్నారు. రానున్న పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఈ సంస్థను రాజకీయ సంస్థగా మార్చాలని జోస్ ఛార్లెస్ నిర్ణయించుకున్నారు. ఆదివారం పుదుచ్చేరిలోని పాండి మెరీనాలో జరిగిన కార్యక్రమంలో పార్టీని ప్రారంభిస్తున్నట్లు ఛార్లెస్ ప్రకటించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రపాలిత ప్రాంతాన్ని అభివృద్ధి చెందిన ప్రాంతంగా మారుస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎఐఎన్‌ఆర్‌సిబిజెపి ప్రభుత్వం నిరుద్యోగం, గృహనిర్మాణం, స్వచ్ఛమైన తాగునీరు, వైద్య సౌకర్యాలు వంటి సమస్యలను పరిష్కరించడంలో విఫలమయిందని విమర్శించారు. అలాగే, ఈ కార్యక్రమానికి అధికార బిజెపికి అనుబంధంగా ఉన్న ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు ఎం శివశంకర్, పి.అంగాలనే హాజరయ్యారు. ఎల్‌జెకె ప్రధాన కార్యదర్శుల్లో ఒకరిగా బిజెపి మంత్రి ఎ జాన్‌కుమార్ కుమారుడు రీగన్ జాన్ కుమార్‌ను నియమించారు.

# లిబియాలో కిడ్నాప్‌కు గురైన భారతీయ కుటుంబం

అక్రమంగా విదేశాలకు వలస వెళ్లే ప్రయత్నంలో గుజరాత్‌కు చెందిన ఓ కుటుంబం లిబియాలో కిడ్నాప్‌కు గురైంది. దంపతులతో పాటు వారి మూడేళ్ల కుమార్తెను కూడా బంధించిన దుండగులు, వారిని విడిచిపెట్టాలంటే రూ. 2 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వివరాలను అధికారులు వెల్లడించారు.మెహసానా జిల్లాలోని బాదల్‌పురా గ్రామానికి చెందిన కిస్మత్‌సిన్హ్ చావ్డా, ఆయన భార్య హీనాబెన్, కుమార్తె దేవాన్షీ.. పోర్చుగల్‌లో స్థిరపడాలని నిర్ణయించుకున్నారు. ఇప్పటికే కిస్మత్‌సిన్హ్ సోదరుడు అక్కడే ఉంటుండటంతో, ఓ పోర్చుగల్ ఏజెంట్ సహాయంతో వారు ప్రయాణం ప్రారంభించారు. ఈ విషయాన్ని మెహసానా ఎస్పీ హిమాన్షు సోలంకి తెలిపారు.పోలీసుల కథనం ప్రకారం ఈ కుటుంబం నవంబర్ 29న అహ్మదాబాద్ నుంచి దుబాయ్ వెళ్లింది. అక్కడి నుంచి వారిని లిబియాలోని బెంఘాజీ నగరానికి తరలించగా, అక్కడే వారు కిడ్నాప్‌కు గురయ్యారు. అనంతరం కిడ్నాపర్లు మెహసానాలోని వారి బంధువులను సంప్రదించి రూ. 2 కోట్లు డిమాండ్ చేశారు. ఈ కేసులో ప్రమేయమున్న ఏజెంట్లు భారతీయులు కాదని పోలీసులు స్పష్టం చేశారు.బాధితుల బంధువులు శుక్రవారం తమను సంప్రదించారని మెహసానా కలెక్టర్ ఎస్.కె. ప్రజాపతి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే సీజే చావ్డా కూడా ఈ అంశాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఈ విషయాన్ని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖకు తెలియజేసి, వారిని సురక్షితంగా విడిపించేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు.

# మోదీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను

బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బీహార్ మంత్రి, ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నితిన్ నబిన్‌ను నియమిస్తూ బీజేపీ పార్లమెంటరీ బోర్డు ఆదివారం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీ కాలం ముగియడంతో పార్టీ ఈ మార్పు చేపట్టింది. కాగా, అత్యంత పిన్న వయస్కుడైన బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీనే కావడం విశేషం. ఆయన వయసు 45 సంవత్సరాలు.ఈ సందర్భంగా నితిన్ నబిన్ మాట్లాడుతూ, తనకు ఇంతటి కీలక బాధ్యతను అప్పగించిన ప్రధాని నరేంద్ర మోదీ, సీనియర్ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ, ప్రధాని మోదీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. "దేశవ్యాప్తంగా పార్టీ విజయాల వెనుక కార్యకర్తల కఠోర శ్రమ ఉంది. నా లాంటి నాయకులతో పాటు ప్రధాని మోదీకి కూడా వారే అసలైన బలం" అని 45 ఏళ్ల నితిన్ వ్యాఖ్యానించారు. అనంతరం ఢిల్లీలో జరిగిన ఓ ర్యాలీలో ప్రధాని మోదీపై కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. "గతంలో కూడా మనం చూశాం. ప్రధాని మోదీని ఎంతగా దూషిస్తే, ఆయన సునామీ అంతగా పెరుగుతారు. మరింత భారీ మెజారిటీతో ఆయన విజయం సాధిస్తారు" అని నితిన్ నబిన్ అన్నారు.



# విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మార్చి 18న చలో ఢిల్లీ

విద్యుత్ ప్రైవేటీకరణ బిల్లుకు వ్యతిరేకంగా మార్చి 18న చలో ఢిల్లీ చేపట్టనున్నట్లు నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ అండ్ ఇంజనీర్స్ (ఎన్‌సిసిఒఇఇఇ) వెల్లడించింది. ఈ కార్యక్రమం తరువాత కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ ప్రయత్నాలను వెనక్కి తీసుకోకపోయినా, ముసాయిదా విద్యుత్ (సవరణ) బిల్లును ఉపసంహరించుకోకపోయినా విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్లు దేశవ్యాప్త సమ్మెకు దిగవలసి వస్తుందని హెచ్చరించింది. ఆదివారం నాడిక్కడ సిఐటియు కేంద్ర కార్యాలయం (బిటి రణదివే భవన్)లో విద్యుత్ రంగానికి సంబంధించిన ప్రధాన భాగస్వాములైన ఉద్యోగులు, వినియోగదారుల మధ్య విస్తృత ఐక్యతను, సమన్వయ చర్యలను నిర్మించడంతో విద్యుత్ హక్కును, మన దేశ ఇంధన భద్రతను పరిరక్షించడం కోసం సమావేశం జరిగింది. దర్శన్‌పాల్ సింగ్, మోహన్ శర్మ, విద్యా సాగర్ గిరి అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో ఎన్‌సిసిఇఇఇ, కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త వేదిక, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) జాతీయ నాయకత్వం పాల్గొన్నారు. దేశంలోని కార్మికులు, రైతాంగంపై జరుగుతున్న దాడులను ఈ సమావేశం తీవ్రంగా పరిగణించింది. విద్యుత్ ప్రైవేటీకరణ, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటరింగ్, ముసాయిదా విద్యుత్ (సవరణ) బిల్లుపై చర్చ జరిగింది. పూర్వాంచల్, దక్షిణాంచల్ విద్యుత్ వితరణ నిగమ్ లిమిటెడ్‌లను ప్రైవేటీకరించడానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న మొండి ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో అణుశక్తి చట్టం, సివిల్ లిబర్టీ ఆఫ్ న్యూక్లియర్ డమేజ్ చట్టానికి సవరణల బిల్లులను ప్రభుత్వం తీసుకొచ్చే అవకాశ ఉందని సమావేశంలో చర్చించారు. ఈ బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెడితే ఎన్‌సిసిఒఇఇఇ, కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త వేదిక, ఎస్‌కెఎం దేశవ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహించాలని నిర్ణయించాయి. విద్యుత్ ప్రైవేటీకరణకు, ముసాయిదా విద్యుత్ (సవరణ) బిల్లుకు వ్యతిరేకంగా జనవరిఫిబ్రవరి నెలల్లో దేశవ్యాప్తంగా భారీ సదస్సులు, ర్యాలీలతో కూడిన ఉమ్మడి ప్రచార కార్యక్రమం నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఎన్‌సిసిఒఇఇఇ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్లు మార్చి 18న ఢిల్లీకి మార్చ్ నిర్వహించాలని, ఈ కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని అన్ని కార్మిక, రైతు సంఘాలకు ఎన్‌సిసిఒఇఇఇ విజ్ఞప్తి చేసింది.




# ఐసిస్ ఉగ్రవాదులు దాడిలో అమెరికా సైనికులు మృతి

సిరియాలో ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్) ఉగ్రవాదులు జరిపిన దాడిలో ఇద్దరు అమెరికా సైనికులు, ఒక పౌర అనువాదకుడు మరణించారు. ఈ ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. దీనికి చాలా తీవ్రమైన ప్రతీకారం ఉంటుందని హెచ్చరించారు. శనివారం జరిగిన ఈ దాడిలో మరో ముగ్గురు సైనికులు గాయపడినట్లు ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్టులో తెలిపారు. ఐసిస్‌ను నిర్మూలించేందుకు అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ ఇన్హెరెంట్ రిజాల్వ్'లో భాగంగా ఈ సైనికులు పనిచేస్తున్నారు. పాల్మైరా ప్రాంతంలో కీలక నేతలతో సమావేశమవుతున్న సమయంలో ఈ దాడి జరిగింది.గతేడాది డిసెంబర్‌లో బషర్ అల్‌అస్సాద్ అధికారం కోల్పోయిన తర్వాత సిరియాలో అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోవడం ఇదే తొలిసారి. దాడికి పాల్పడిన వ్యక్తి సిరియా ప్రభుత్వ దళాలకు చెందిన సైనికుడేనని అక్కడి ప్రభుత్వం అంగీకరించడం గమనార్హం. అయితే, అతడిని ఇప్పటికే మట్టుబెట్టామని, అంతర్గత భద్రతా విభాగంలో అతడికి ఎలాంటి నాయకత్వ పాత్ర లేదని సిరియా ప్రభుత్వ ప్రతినిధి స్పష్టం చేశారు. పాల్మైరా ప్రాంతంలో ఐసిస్ దాడి జరిగే ప్రమాదం ఉందని తాము ముందే అమెరికాను హెచ్చరించినా వారు పట్టించుకోలేదని సిరియా ఆరోపించింది.ఈ దాడి జరిగిన ప్రాంతం సిరియా కొత్త ప్రభుత్వ పూర్తి నియంత్రణలో లేదని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ఘటనపై సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్ షరా తీవ్ర ఆగ్రహంతో, ఆవేదనతో ఉన్నారని తెలిపారు. ఉగ్రవాదంపై పోరులో భాగంగా ఇటీవలే అల్‌షరా వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో సమావేశమయ్యారు. తాజా పరిణామం ఇరు దేశాల మధ్య సహకారానికి పరీక్షగా నిలిచింది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కరుణాపురం సర్పంచ్‌గా గుర్రపు రీనా ప్రవీణ్

- హేమా,హేమీలతో ఢీ కోన్న యువ నేత
- మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించిన యువ జంట
- కరుణాపురం గ్రామ రాజకీయాల్లో ఆసక్తికర మలుపు
- స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని సర్పంచుల్లో అతి పిన్న వయస్కురాలుగా రీనా రికార్డు
- నియోజకవర్గంలో హాట్ టాపిక్ గా గుర్రపు ప్రవీణ్



**ధర్మసాగర్,డిసెంబర్15(తెలంగాణ ముచ్చట్లు):** మండలంలోని కరుణాపురం గ్రామంలో జరిగిన స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికలు గ్రామ రాజకీయాల్లో ఆసక్తికర మలుపు తిరిగేలా చేశాయి. ఈ ఎన్నికల్లో తొలిసారి పోటీ చేసిన గుర్రపు రీనా ప్రవీణ్ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుని 37 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. దీంతో కరుణాపురం గ్రామానికి రెండవ సర్పంచ్‌గా రీనా ప్రవీణ్ ఎన్నికై ప్రత్యేక గుర్తింపు సాధించారు.

ఈ ఎన్నికల్లో హేమా, హేమీ లతో తీవ్ర పోటీ నెలకొనగా చివరి వరకూ ఉత్కంఠ కొనసాగింది. గ్రామ రాజకీయాల్లో అనుభవం ఉన్న నాయకులు బరిలో నిలిచినా,గ్రామ ప్రజలు మాత్రం యువ జంటకు మద్దతుగా నిలిచి మార్పు వైపు అడుగులు వేశారు. గ్రామాభివృద్ధి, పారదర్శక పాలననే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్లిన రీనా ప్రవీణ్ ప్రచారానికి యువత పెద్ద ఎత్తున అండగా నిలవడం విజయానికి కీలకంగా మారింది.

యువత నడకతో పాటు గ్రామ ప్రజల సమిష్టి మద్దతు లభించడంతో ఈ విజయం సులభంగా సాధ్యమైంది.

### నా విజయం.. గ్రామ ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబం

సర్పంచ్‌గా ఎన్నికైన గుర్రపు రీనా ప్రవీణ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఓటు వేసిన గ్రామ ప్రజలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం వ్యక్తిగతమైనది కాదని, గ్రామ ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. గ్రామ పాలనలో పారదర్శకతకు పెద్దపీట వేస్తానని, ప్రతి నిర్ణయం ప్రజలతో చర్చించి, ప్రజల మేలు కోసమే తీసుకుంటానని హామీ ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమన్వయంతో అమలు చేస్తూ కరుణాపురం గ్రామాన్ని రాష్ట్రంలోనే ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని రీనా ప్రవీణ్ స్పష్టం చేశారు.

రాజకీయ అనుభవం కంటే నిజాయితీ, కృషి ముఖ్యమని ఈ ఎన్నిక మరోసారి నిరూపించింది.నూతనంగా ఎన్నికైన సర్పంచ్ రీనా ప్రవీణ్ ఈ నెల20న కరుణాపురం గ్రామ రెండవ సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

ఈ నేపథ్యంలో గ్రామంలో సంబరాలు అంబరాన్ని తాకాయి. పలువురు గ్రామస్థులు, శ్రేయోభిలాషులు రీనా ప్రవీణ్‌ను కలిసి శాలువాలు కప్పి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి కొత్త దిశ చూపుతారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని సర్పంచుల్లో అతి పిన్న వయస్కురాలుగా రీనా రికార్డు సృష్టించారు.



నూతన సర్పంచ్ గుర్రపు రీనా ప్రవీణ్‌కు భారత రాజ్యాంగం అందించిన మిత్ర బృందం







# నాడు ఎంపీటీసీ.. నేడు సర్పంచ్

- పట్టువదలని పోరాటానికి ప్రతీకగా నసుబాల సోమక్క చంద్రమౌళి

**ధర్మసాగర్,డిసెంబర్15(తెలంగాణ ముచ్చట్లు):** మండలంలోని తాటికాయల గ్రామంలో జరిగిన సర్పంచ్ ఎన్నికలు రాజకీయంగా ఆసక్తికరంగా మారాయి.ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ మద్దతుతో బరిలోకి దిగిన నసుబాల సోమక్క చంద్రమౌళి,అధికార కాంగ్రెస్ పార్టీ బలపరిచిన పెసరు రమేష్‌పై 186 ఓట్ల భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు. నిన్నటి వరకు ఎంపీటీసీగా ఉన్న సోమక్క చంద్రమౌళి, నేడు గ్రామ సర్పంచ్‌గా ఎన్నికై తన రాజకీయ ప్రయాణంలో మరో కీలక మైలురాయిని అందుకున్నారు.

చంద్రమౌళి 2001లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. అప్పటి నుంచి గ్రామ రాజకీయాల్లో క్రియాశీలకంగా కొనసాగుతూ ప్రజల సమస్యలపై పోరాటం చేస్తూ వచ్చారు. ఈ ప్రయాణంలో ఆయన, ఆయన సతీమణి కలిసి గతంలో మూడు సార్లు సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచినా విజయాన్ని అందుకోలేకపోయారు. అయినప్పటికీ వెనుకడుగు వేయకుండా పట్టుదలతో రాజకీయాల్లో కొనసాగారు.

నాలుగోసారి పట్టువదలని విక్రమార్కునిలా మళ్లీ ప్రజల ముందుకు వచ్చిన నసుబాల సోమక్క చంద్రమౌళి, ఈసారి ప్రజల సంపూర్ణ మద్దతు పొందుతూ స్పష్టమైన మెజారిటీతో విజయం సాధించారు.ఈ ఫలితం గ్రామ ప్రజల్లో మార్పు పట్ల ఉన్న ఆకాంక్షకు ప్రతిబింబంగా రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. తాటికాయల గ్రామ అభివృద్ధికి కొత్త దిశ చూపుతారన్న ఆశాభావాన్ని గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారు.

ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ,చంద్రమౌళి అభిమానులు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు.

### ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం

ఈ సందర్భంగా తాటికాయల నూతన సర్పంచ్ నసుబాల సోమక్క చంద్రమౌళి మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ఓటు వేసిన గ్రామ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం వ్యక్తిగతంగా తనదికాదని, గ్రామాభివృద్ధిని కోరుకున్న ప్రజల ఆశయానికి ప్రతీకగా లభించిన బాధ్యతగా భావిస్తున్నానని అన్నారు. గ్రామ పాలనలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ, ప్రజలతో నిరంతర సంభాషణ కొనసాగిస్తానని, ప్రతి వార్డు సమానంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. తాటికాయల గ్రామాన్ని అభివృద్ధి, సంక్షేమం, మౌలిక సదుపాయాల పరంగా ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని నసుబాల సోమక్క చంద్రమౌళి తెలిపారు.



# సీఎంలు, పీఎంలు,ఎమ్మెల్యేలు ఫిట్‌గా ఉండాలి

- రాజకీయ నాయకులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదర్శం
- ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

**హైదరాబాద్,డిసెంబర్15(తెలంగాణ ముచ్చట్లు):** దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలంటే ప్రధాని, ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపీలు శారీరకంగా ఫిట్‌గా ఉండాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. నాయకులు ఆరోగ్యంగా ఉంటేనే పాలనలో చురుకుదనం కనిపిస్తుందని, అప్పుడే దేశం, రాష్ట్రం వేగంగా అభివృద్ధి సాధిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ ఫుట్‌బాల్ ఆడుతూ ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఫుట్‌బాల్ ఆటే ఆయన ఆరోగ్య రహస్యమని, ఇప్పుడే కాదు గతం నుంచే ఆయన క్రీడలపై ఆసక్తి చూపుతున్నట్లు కనిపిస్తోందన్నారు. ప్రపంచ స్థాయి క్రీడాకారులతో కలిసి ఫుట్‌బాల్ ఆడటం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఈ విషయంలో రేవంత్ ఇతర రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. రాజకీయ నాయకులు క్రీడల్లో పాల్గొంటే వారిలో క్రీడాస్ఫూర్తి పెరిగి ప్రజల పట్ల నిబద్ధత మరింత బలపడుతుందని పిడమర్తి రవి అన్నారు. ఒక నాయకుడు క్రీడాకారుడిగా మారితే చివరి వరకు ప్రజల కోసం పనిచేసే మనస్తత్వం అలవడుతుందని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు తమకు ఉన్న సౌకర్యాలను వినియోగించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.



రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఫుట్‌బాల్ ఆడుతుండగా, జూపల్లి కృష్ణారావు స్విమ్మింగ్, తుమ్మల నాగేశ్వరరావు వాలీబాల్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కబడ్డీ వంటి క్రీడల్లో పాల్గొంటున్నారని తెలిపారు. రాజకీయ నాయకులు కేవలం ఒక ఆట ఆడటంతో సరిపెట్టుకోకుండా, ఆ క్రీడను దత్తత తీసుకొని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో బాక్సింగ్, టెన్నిస్, షటిల్, కుస్తీ వంటి సంప్రదాయ క్రీడలకు విశేష ప్రాధాన్యం ఉందని, వీటిని ప్రోత్సహించడం ద్వారా శారీరక దారుఢ్యం పెరగడమే కాకుండా క్రీడలకు ప్రచారం కూడా లభిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ క్రీడల్లో భారతదేశం పథకాలు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలపై బీఆర్ఎస్ పోరుబాట

పాలమూరు ఎత్తిపోతలకు సంబంధించి ఈ నెల 11న ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్ కీలక భేటీ నిర్వహించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, వి.శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డితో పాటు మరికొందరు ముఖ్య నేతలు ఈ భేటీలో పాల్గొన్నట్లు సమాచారం.

'కొడంగల్ లిఫ్ట్'పై బీఆర్ఎస్ వ్యతిరేకత

90 శాతం పనులు పూర్తయిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పక్కన పెట్టి కొత్తగా కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని చేపట్టడాన్ని బీఆర్ఎస్ వ్యతిరేకిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ద్వారా పాలమూరు, రంగారెడ్డి జిల్లాలకు జరిగే నష్టాన్ని వివరించేందుకు ఈ నెలాఖరు లేదా జనవరిలో మహబూబ్‌నగర్ జిల్లాలో ఒకటి లేదా రెండు చోట్ల భారీ బహిరంగ సభలు నిర్వహించాలని భావిస్తోంది.

కేసీఆర్ ఈ సభలకు హాజరయ్యే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు నదీ జలాల అనుసంధానం పేరిట ఏపీ చేపడుతున్న అక్రమ ప్రాజెక్టులపైనా ఉద్యమానికి కేసీఆర్ ఇప్పటికే రూపకల్పన చేసినట్లు సమాచారం.

కాళేశ్వరం మరమ్మతుల కోసం ఒత్తిడి

కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బరాజ్‌ను మరమ్మతు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని బీఆర్ఎస్ భావిస్తోంది. అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ప్రభుత్వానికి జల విధానం లేకపోవడాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఉద్యమ కార్యాచరణ ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఈ నెల 19న జరిగే భేటీలో కేసీఆర్ ప్రకటించే ఉద్యమ కార్యాచరణపై బీఆర్ఎస్‌లో ఉత్కంఠ నెలకొంది. ఈ ఏడాది ఏప్రిల్ 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగిన పార్టీ రజతోత్సవ వేడుకల తర్వాత కేసీఆర్ పార్టీ బహిరంగ కార్యక్రమాల్లో కనిపించలేదు. సుదీర్ఘ కాలం తర్వాత పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి వస్తున్న కేసీఆర్.. పంచాయతీ ఎన్నికలు, ఫలితాలు, పార్టీ సంస్థాగత నిర్మాణంపై కూడా స్పందించే అవకాశం ఉంది.



# 2029 ఎన్నికల్లో పోటీ చేస్తాం



**హైదరాబాద్,డిసెంబర్15(తెలంగాణ ముచ్చట్లు):** సామాజిక తెలంగాణయే తన ధ్యేయమని, 2029 ఎన్నికల్లో పోటీ చేస్తామని, ప్రజలు సూచించిన పేరునే పార్టీకి పెడతామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. సోమవారం 'ఆస్క్ కవిత'హ్యాష్ ట్యాగ్‌పై 'ఎక్స్'లో పలువురు నెటిజన్లు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానాలిచ్చారు.

యువత, మహిళలకు రాజకీయ అవకాశాలు రావాలని, నాణ్యమైన, మెరుగైన ఉచిత విద్య, వైద్యం ప్రజలకు అందాలని కోరారు. తెలంగాణలో తల్లిదండ్రులు పిల్లల చదువుకోసం ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టకుండా ఉండే పరిస్థితి రావాలన్నారు. కాంగ్రెస్ సర్కార్ అన్ని రంగాల్లో అట్టర్ ఫ్లాప్ అయ్యిందని, రేవంత్ పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆరోపించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవటంతో లక్షలాది మంది విద్యార్థులు చదువులకు దూరం కావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఫార్మా సిటీ కోసం తీసుకున్న భూముల రైతులతో కలిసి పోరాటం చేస్తామన్నారు.

# ఎం.పి.హెచ్.డబ్ల్యు పరీక్షా ఫలితాల్లో స్టేట్ ర్యాంకులు

**విద్యార్థినులకు కలెక్టర్ మిఠాయిల పంపిణీ**

**ఖమ్మం,డిసెంబర్15(తెలంగాణ ముచ్చట్లు):** అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలకు కృషి తోడైతే అద్భుత విజయాలు సాధ్యం అవుతాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎం.పి.హెచ్.డబ్ల్యు పరీక్షా ఫలితాల్లో స్టేట్ ర్యాంకులు కైవసం చేసుకున్న మహిళా ప్రాంగణం విద్యార్థినులకు కలెక్టర్ మిఠాయిలు పంచి అభినందించారు. రాష్ట్ర స్థాయిలో 2, 4, 5, 7, 8, 10 ర్యాంకులు.. జిల్లా స్థాయిలో మొదటి 15 ర్యాంకులు సాధించారు. గత మూడేళ్లుగా వరుసగా రాష్ట్రస్థాయి ర్యాంకులను కైవసం చేసుకోవడానికి విద్యార్థినులకు ఉత్తమ శిక్షణ అందిస్తున్న మహిళా ప్రాంగణం మేనేజర్ వేల్పుల విజేతను కలెక్టర్ ప్రశంసించారు. పేద విద్యార్థినులు, ఏజెన్సీ ప్రాంతానికి చెందిన వారు స్థానిక మహిళా ప్రాంగణంలో చదువుకొని రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులు చిన్నప్పుడే ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకొని, అందుకు

# స్థానికంలో కాంగ్రెస్‌నే గెలిపించండి

**పలు ప్రాంతాల్లో మంత్రి వివేక్ ప్రచారం**

**ఆదిలాబాద్,డిసెంబర్15(తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. గత ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలను పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ బలపరచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. డిసెంబర్ 17న జరగనున్న మూడో విడత పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జైపూర్ మండలంలోని పలు గ్రామాల్లో మంత్రి వివేక్ క్యాంపెయినింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే రేషన్ ద్వారా సన్న బియ్యం ఇస్తోన్న ఏకైక రాష్ట్ర తెలంగాణ అని అన్నారు. 10 ఏండ్లుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇవ్వని రేషన్ కార్డులను అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇచ్చామని చెప్పారు. జైపూర్ పవర్ ప్లాంట్?లో కొత్తగా 800 మెగా వాట్ల పవర్ ప్లాంట్?ను నిర్మించనున్నారని.. అందులో స్థానిక యువతకే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి చెన్నూర్లో ఏటీసీ సెంటర్?ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇస్తామని మోసం చేసిందని విమర్శించారు.

Printed, Published and Owned by B.PRAMOD KUMAR, B258, Phase1, Vanasthalipuram, Hyderabad70. Printed at Garuda Printers, Plot No.91, Sri Ramnagar Colony, Kharmanghat, Hyderabad500035, Telangana. Published at H.No. B258, Phase1, Vanasthalipuram, Hyderabad500070, Telangana. Editor: N.Ramakrishna Reddy, email: citytimestd@gmail.com, RNI: APTEL/2001/5896